


# విజయభాను




విశాఖపట్నం, సోమవారం 04-12-2017 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 41 సంచిక : 81 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## బీసీల సంక్షేమమే ధ్యేయంగా
# పనిచేస్తున్నాం



హైదరాబాద్ : రాష్ట్రంలోని బీసీల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకెళ్తుందని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు స్పష్టం చేశారు. అసెంబ్లీలోని కమిటీ హాల్‌లో అన్ని పార్టీలకు చెందిన బీసీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సీఎం కేసీఆర్ సమావేశం కొనసాగుతోంది. ఈ సందర్భంగా బలహీన వర్గాల కోసం ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కేసీఆర్ వివరించారు. బీసీల అభివృద్ధికి సంబంధించి.. ఆయా వర్గాల నుంచి చాలా డిమాండ్లు, వినతులు వస్తున్నాయని తెలిపారు. బీసీలకు సబ్ ప్లాన్ అమలు చేయాలన్న డిమాండ్ ఉందన్నారు. బీసీల సంక్షేమం కోసం మరిన్ని కార్యక్రమాలు అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని సీఎం స్పష్టం చేశారు. బీసీ ప్రజాప్రతినిధుల అభిప్రాయాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. అందరి సూచనలను ప్రభుత్వం సానుకూలంగా స్వీకరిస్తుందని తెలిపారు. బీసీ ప్రజాప్రతినిధులు రెండు రోజుల పాటు అన్ని విషయాలపై చర్చించి ఏకాభిప్రాయానికి రావాలని సీఎం సూచించారు. ప్రజాప్రతినిధుల సూచనలకు అనుగుణంగా కార్యక్రమాలు రూపొందించి అమలు చేస్తామని కేసీఆర్ పేర్కొన్నారు.

బీసీల అభ్యున్నతి కోసం ఇప్పటికే ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని సీఎం స్పష్టం చేశారు. బీసీల జీవన ప్రమాణాలు మరింత పెరగాలంటే మరిన్ని చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బీసీ వర్గాలకు చెందిన ప్రజాప్రతినిధులు రాజకీయాలకతీతంగా అన్ని కులాల అభిప్రాయాలు తీసుకుని ఏం చేయాలో ప్రభుత్వానికి దిశానిర్దేశం చేయాలని సీఎం సూచించారు.

బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్, ఎంబీసీ కార్పొరేషన్ ఎలా పని చేయాలో, స్వయం ఉపాధి పథకాల స్వరూపం ఎలా ఉండాలో సూచించాలని సీఎం కోరారు. సమాజంలో సగభాగం కన్నా అధికంగా ఉన్న బలహీనవర్గాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కేసీఆర్ స్పష్టం చేశారు.



# కాంగ్రెస్ ప్రజలను విడగొడుతోంది

గుజరాత్ : ఉత్తర ప్రదేశ్‌ను దశాబ్దాలపాటు పరిపాలించిన కాంగ్రెస్ ఆ రాష్ట్రంలో తుడిచిపెట్టుకుపోయిందని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఎద్దేవా చేశారు. గుజరాత్ శాసనసభ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయన భరూచ్ సమీపంలోని అమోద్‌లో జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. ఉత్తర ప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ తుడిచిపెట్టుకుపోయిందన్నారు. కాంగ్రెస్ గురించి ఉత్తర ప్రదేశ్ ప్రజలకు బాగా తెలుసునని, అదేవిధంగా గుజరాతీలకు కూడా తెలుసునని అన్నారు. కులం, మతం, పట్టణం, గ్రామం పేరుతో ప్రజలను విడదీయడమే ఆ పార్టీ లక్ష్యమని ఆరోపించారు.

బనస్కాంతలో వరదలు వచ్చినపుడు ప్రజలు ఇబ్బందులు తరువాయి 2లో

## బీసీలు, కాపులను
# ఓటుబ్యాంకుగా చూడలేదు



అమరావతి: కొన్ని పార్టీలు రాజకీయ లబ్ధి కోసం కులాలను రెచ్చగొడుతున్నాయని, దీనిపట్ల తెలుగుదేశం పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని తాజా పరిస్థితులపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఆదివారం ఉదయం చంద్రబాబు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కాపు రిజర్వేషన్లు, బీసీ సంఘాల ఆందోళన, మంజునాథ్ వివాదంపై నేతలకు పలు సూచనలు చేశారు. ఈ వ్యవహారంపై నేతలతో సమన్వయం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ తెదేపా అధ్యక్షుడు కళా వెంకట్రావు, మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్సీ టీడీ జనార్దన్‌కు బాధ్యతలు అప్పగించారు.

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. ఏ వర్గానికి అన్యాయం జరగకుండా కాపులకు రిజర్వేషన్లు కల్పించినట్లు చెప్పారు. చాలాకాలంగా ఉన్న డిమాండ్‌ను నేరవేర్చామని, ఇచ్చిన మాటకు కట్టుబడ్డామని పేర్కొన్నారు. బీసీలకు రిజర్వేషన్లలో కోత పెట్టకుండానే కాపులకు రిజర్వేషన్లు ఇస్తామని తరువాయి 2లో

# అవసరమైతే రాజీనామా చేస్తా

ఆర్.కృష్ణయ్య



హైదరాబాద్: కాపులను బీసీల్లో కలుపుతూ ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ చేసిన తీర్మానాన్ని ఖండిస్తున్నట్లు బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... కాపులను బీసీల్లో చేర్చితే బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. దీనిపై న్యాయపోరాటం చేస్తామని తెలిపారు. అవసరమైతే ఎమ్మెల్యే పదవికి, తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేస్తానని స్పష్టం చేశారు.

ఆంధ్రప్రదేశ్‌లో మంజునాథ కమిషన్ నివేదిక ఆధారంగా కాపులను బీసీల్లో చేరుస్తూ, బీసీ-ఎఫ్ కేటగిరీలో 5శాతం రిజర్వేషన్ కల్పించాలని అసెంబ్లీలో తీర్మానం చేసిన విషయం తెలిసిందే.

# బీసీ ప్రజాపతినిధులతో కేసీఆర్ సమావేశం

హైదరాబాద్: బలహీన వర్గాల సంక్షేమంపై విస్తృతస్థాయి చర్చ సహా అమలు చేయాల్సిన కొత్త కార్యక్రమాలపై చర్చించేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని పార్టీల బీసీ ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. శాసనసభ కమిటీ హాల్‌లో జరుగుతున్న ఈ సమావేశానికి మండలి ఛైర్మన్ నేతి స్వామిగౌడ్, శాసనసభాపతి మధుసూదనాచారి, మంత్రులు ఈటల రాజేందర్, పద్మారావు, జోగు రామన్న, కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ, అన్ని పార్టీలకు చెందిన బీసీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. శాసనసభ శీతాకాల సమావేశాల్లో బీసీ సంక్షేమంపై చర్చ సందర్భంగా కేసీఆర్ చేసిన ప్రకటనకు అనుగుణంగా సమావేశం జరుగుతోంది. బీసీల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలతో పాటు కొత్తగా అమలు చేయాల్సిన కార్యక్రమాలపై ఈ సమావేశంలో చర్చిస్తున్నారు. తరువాయి 2లో

# జొన్నగిరికి చేరుకున్న జగన్ పాదయాత్ర



కర్నూలు : వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్పయాత్ర కర్నూలు జిల్లా జొన్నగిరిలో కొనసాగుతోంది. అక్కడినుంచి ఎర్రగుడి, తుగ్గలికి వైఎస్ జగన్ చేరుకోనున్నారు. అనంతరం చెరువుతొండ వరకూ పాదయాత్ర కొనసాగనుంది. ప్రజాసంకల్పయాత్రలో ప్రజలు వైఎస్ జగన్‌తో కలసి నడుస్తున్నారు.

తమ సమస్యలను జననేతతో చెప్పుకుంటున్నారు. రాత్రికి చెరువుతొండలోనే బస చేస్తారు. 24వ రోజు ప్రజాసంకల్పయాత్రలో వైఎస్ జగన్ 15.6 కిలోమీటర్లు నడిచారు.

## కులాల పేరుతో
# కాంగ్రెస్ చిచ్చు




అహ్మదాబాద్: కులాల పేరుతో గుజరాత్‌ను కాంగ్రెస్ విడగొడుతోందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి సరైన నాయకత్వం లేదని, కులం పేరుతో రాష్ట్రాన్ని విడిదీయాలనుకునే శక్తులకే నాయకత్వం అప్పగించిందని ఆదివారం నాడిక్కడ మీడియాతో మాట్లాడుతూ ఎద్దేవా చేశారు. సుపరిపాలన అందించిన ట్రాక్ రికార్డు బీజేపీ సొంతమని అన్నారు. 'అభివృద్ధి, రాజకీయ స్థిరత్వం ఒకవైపు, అవకాశవాద కూటమి, అరాచకం మరోవైపు పోటీపడుతున్నాయి. ఈ రెండింటి మధ్యే పోటీ నెలకొంది. 22 ఏళ్ల పాటు అద్భుతమైన పాలన అందించిన ట్రాక్ రికార్డు బీజేపీకి ఉంది' అని ఆయన అన్నారు. 182 సీట్ల గుజరాత్ అసెంబ్లీకి ఈనెల 9న తొలివిడత, 14న చివరి విడత పోలింగ్ జరుగనుండగా, 18న ఓట్లు లెక్కించి ఫలితాలు ప్రకటిస్తారు.

## టేకిట్-ఈజీ



ప్రచారపర్వంలో పరస్పర వాగ్బాణాలు పదును ఎప్పుడు తగ్గుతాయో ఏమో?

# మహారాష్ట్ర, గుజరాత్ వైపు ఓఖి పయనం




చెన్నై: అరేబియా సముద్రంలో ఏర్పడి పెను తుపానుగా మారిన ఓఖి ఆదివారం నుంచి బలహీనపడే అవకాశాలు ఉన్నాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. లక్షద్వీప్ ప్రాంతంపై కేంద్రీకృతమై ఉన్న ఈ తుపాను వాయువ్య దిశగా గంటకు 15 కి.మీ వేగంతో కదులుతూ మహారాష్ట్ర, దక్షిణ గుజరాత్ వె%పు దిశ మార్చుకుంటుందోని తెలిపారు.

ఓఖి తుపాను ప్రభావంతో కేరళలో ఇప్పటి వరకూ 9 మంది ప్రాణాలు కోల్పోయారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. తిరువనంతపురం, కొల్లామ్, ఎర్నాకులమ్, త్రిసూర్, మలపురం జిల్లాల్లో 34 శిబిరాలను ఏర్పాటు చేసి వేలాది నిరాశ్రయులను తరలించారు. లక్షద్వీప్‌లో తుపాను బీభత్సం సృష్టించింది. ఇక్కడ వందలాది ఇళ్లు నేలమట్టమయ్యాయి.

కేరళలో గల్లంతైన 117 మంది మత్స్యకారుల ఆచూకీ ఇంకా తెలియడం లేదని.. గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని కోస్ట్ గార్డు అధికారులు తెలిపారు. కేరళ వ్యాప్తంగా 531 మంది మత్స్యకారులను ఇప్పటి వరకూరక్షించామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు. భారత నేవీ, వె%మానిక, కోస్ట్ గార్డు సిబ్బంది గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. మరోవె%పు ఈ తుపాను బీభత్సాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలని పినరయి విజయన్ కేంద్రాన్ని కోరారు.



# స్మార్ట్ ఇండియాయే మా లక్ష్యం




పర్లాఖెముండి : గజపతి జిల్లాలోని సెంచూరియన్ విశ్వవిద్యాలయానికి చెందిన ఇద్దరు విద్యార్థులు రూపొందించిన హెల్లోటీనీ అనే యాప్‌ను విశ్వ విద్యాలయ ఉపాధ్యక్షుడు డి.ఎన్.రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డి.ఎన్.రావు మాట్లాడుతూ సెంచూ రియన్ విశ్వవిద్యాలంలో బి.టెక్ కంప్యూటర్ సైన్సు విభాగం 3వ ఏడాది చదువుతున్న ఇద్దరు విద్యార్థులు పాతపట్నం మండలంలోని పెద్దసీదికు చెందిన చదువుల ప్రశాంత్, పర్లాఖెముండికి చెందిన ఎన్ని విశ్వచందన్ సంయుక్తంగా హెల్లోటీనీ యాప్‌ను రూపొందించారు. దీనిని మాధ్యమంగా ఉపయోగించి అమేజాన్, ఫ్లిప్‌కార్ట్‌లతోపాటు ఇతర రంగాలకు చెందిన పలు యాప్‌లు అందించే సేవలను పొందవచ్చు. హెల్లోటీనీ ద్వారా ఏ సంస్థల వెబ్‌సైట్, పేస్‌బుక్ మెసెంజర్, ఫోన్‌నెంబరుకి మెసేజ్ చేయడం, మెయిల్, ట్వీటర్, ఫోన్ కాల్ ద్వారా ఆర్డర్ చేసిన ఏ వస్తువైనా తమ ఇంటివద్దకు వస్తుందన్నారు. ఎలాంటి యాప్స్‌ను డౌన్‌లోడ్ చేసుకోవల్సిన పనిలేకుండా అన్నింటిసేవలను ఈ ఒక్క యాప్ ద్వారా పొందవచ్చన్నారు. అనంతరం విద్యార్థి చదువుల ప్రశాంత్ మాట్లాడుతూ ప్రస్తుతం పర్లాఖెముండి, శ్రీకాకుళం జిల్లాలో ఈ సౌకర్యం పొందగలరని, రానున్న రోజులలో మరిన్ని ప్రాంతాలలో విస్తరింపజేస్తామన్నారు. అనంతరం హెల్లోటీనీ గురించి వివరించారు. రూరల్ ఇండియా, అర్బన్ ఇండియాని స్మార్ట్ ఇండియాగా చేయడమే మా ఆశయం అని అన్నారు. కావాల్సిన వస్తువులు పొందేందుకు 07064822044 నెంబరుకి మెసెజ్‌చేస్తే వాటిని పొందగలరన్నారు. ఈ కార్యక్రమంలో డి.ఎన్.రావుతోపాటు రిజిస్ట్రార్ అనితాపాత్ర్, బి.పి.మిశ్ర, దుర్గాపాఢి, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

## బీసీలు, కాపులను ఓటు బ్యాంకుగా చూడలేదు

గతంలో చెప్పామని.. ఇప్పుడు చేసి చూపించామన్నారు. బీసీలకు ఎలాంటి అన్యాయం జరగలేదని స్పష్టం చేశారు. బీసీలు, కాపులను తెలుగుదేశం పార్టీ ఎన్నడూ ఓటుబ్యాంకుగా చూడలేదన్నారు. తెలంగాణలో కొన్ని కులాలను బీసీ జాబితా నుంచి తొలగించినప్పుడు మాట్లాడని ఆర్.కృష్ణయ్య కాపు రిజర్వేషన్లపై అనవసర విమర్శలు చేస్తున్నారని కొందరు నేతలు చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు.

## కాంగ్రెస్ ప్రజలను విడగొడుతోంది

పడుతూ ఉంటే, కాంగ్రెస్ నేతలు బెంగళూరు వెళ్ళారని మోదీ అన్నారు. రాజ్యసభ ఎన్నికల్లో ఓ నేత ఓడిపోకుండా కాపాడుకోవడానికి వారు బెంగళూరు వెళ్ళారన్నారు. ఆ నేత కాంగ్రెస్ పార్టీలో అతి పెద్ద నేత అని, ఆయన భరూచ్‌కు ఏం చేశారని ప్రశ్నించారు. నర్మద కోసం ఆయన కృషి చేయలేదని, రో-రో ఫెర్రీ గురించి కూడా ఆయన ఆలోచించలేదని అన్నారు. భరూచ్, కచ్ జిల్లాల్లో ముస్లింలు అధికంగా ఉన్నారని మోదీ చెప్పారు. బీజేపీ పాలనలో ఈ జిల్లాలు వేగంగా అభివృద్ధి చెందాయన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నేత, సోనియా గాంధీ రాజకీయ సలహాదారు అహ్మద్ పటేల్ గుజరాత్‌లోని భరూచ్ ప్రాంతానికి చెందినవారే.

## బీసీ ప్రజాపతినిధులతో కేసీఆర్ సమావేశం

గొర్రెల పంపిణీ, చేపల పెంపకం తరహాలో రజకులు, నాయీ బ్రాహ్మణుల కోసం పథకాలు, స్వయం ఉపాధి, ఆర్థిక తోడ్పాటు పథకాల అమలు, ఉపకార వేతనాలు, బోధనా రుసుములు తదితర అంశాలపై భేటీలో చర్చిస్తారు.

# ఆంధ్రప్రదేశ్‌లో కళింగ ఆలయాల వైభవం

## భంజవిహార్‌లో ఆచార్య రామయ్యకు సత్కారం



గోపాలపూర్ : అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లో ప్రాచీన కళింగ ఆలయాల వైభవం ప్రత్యే కమని, నాటి శిల్పాచార్యుల నైపుణ్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయని హైదరాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆర్కియాలజీ విభాగాధిపతి ఆచార్య జి.వి.రామయ్య తెలిపారు. బ్రహ్మపుర విశ్వవిద్యాలయం(భంజవిహార్) చరిత్ర విభాగం స్వర్ణోత్సవాల్లో భాగంగా ఆంధ్ర ప్రదేశ్‌లో కళింగ ఆలయాలు అన్న అంశంపై సదస్సు ఏర్పాటైంది. కార్యక్రమంలో ముఖ్య వక్తగా పాల్గొన్న ఆచార్య రామయ్య ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రాచీన(కళింగ) ఆలయాలు, శిల్పకళ, జగన్నాథ సంస్కృతి, ఆచార వ్యవహారాలపై విపులంగా వివరించారు. శ్రీకాకుళం, విజయ నగరం, విశాఖ జిల్లాల్లో పెద్ద సంఖ్యలో ఉత్కళీయులు స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని తెలుగు ప్రజలతో మమేక మయ్యా రన్నారు. దక్షిణ ఒడిశాలో 40 శాతానికిపైగా ఉత్కళాంధ్రులు స్థిరపడి సమైక్యతకు అద్దం పడుతున్నారన్నారు. ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని ఆలయాలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పడు తున్నా యని విశ్లేషించారు.

భంజవిహార్ ఉపకులపతి ఆచార్య రాజేంద్రప్రసాద్‌దాస్ అధ్యక్షతన ఏర్పాటైన సదస్సులో కౌన్సిల్ ఛైర్మన్ ఆచార్య దేవీప్రసన్న పట్నాయక్, భగవాన్ సాహు, సనాతన నాయక్, రమాకాంత భుయ్యా ప్రసం గించారు. అనంతరం ఆచార్య రామయ్యను భంజవిహార్ యంత్రాంగం సత్కరించింది.

## మద్రాసు హైకోర్టులో 11 మంది మహిళా న్యాయమూర్తులు

చెన్నై : మద్రాసు హైకోర్టులో ఆరుగురు న్యాయమూర్తులు ప్రమాణస్వీకారం చేశారు. ఇందులో నలుగురు మహిళా న్యాయ మూర్తులు ఉండటం గమనార్హం. ఇప్పటికే ప్రధాన న్యాయ మూర్తితోపాటు ఏడుగురు మహిళా న్యాయమూర్తులు ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. తాజాగా ప్రమాణస్వీకారం చేసినవారితో కలిపి హైకోర్టులో మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 60కి చేరింది. మొత్తం ఉండాల్సిన వారి సంఖ్య 75. ఇంకా 15 మంది తక్కువగా ఉన్నారు. 125 సంవత్సరాల చరిత్రలో తొలిసారిగా 11 మంది మహిళా న్యాయమూర్తులతో మద్రాసు హైకోర్టు రికార్డు సృష్టించింది. ఆరుగురు న్యాయమూర్తులతో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఇందిరా బెనర్జీ శుక్రవారం ప్రమాణం చేయించారు. వీరిలో ఎస్.రామతిలగం, ఆర్.తరణి, టి.కృష్ణవల్లి, ఆర్.హేమలత, పి.రాజమాణిక్యం, ఆర్.పొంగియప్పన్ ఉన్నారు. వీరికి రాష్ట్ర అడ్వొకేటు జనరల్ విజయ్ నారాయణ్, ఇతర హైకోర్టు సిబ్బంది, బార్ అసోసియేషన్ సభ్యులు తదితరులు అభినందనలు తెలిపారు.

## వలసలతోనే వ్యాధి తీవ్రం

గోపాలపూర్ : రాష్ట్రంలో హెచ్‌ఐవీ/ఎయిడ్స్ వ్యాధి నియంత్రణ లోకి తేవాలంటే పెద్ద ఎత్తున ప్రజా చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని, వలసపోతున్న వారిపై రోగనిర్ధారణ పరీక్షలు తరచూ చేపట్టాలని వక్తలు కోరారు. ప్రపంచ ఎయిడ్స్ దినం పురస్కరించుకుని గోపాలపూర్ కళాశాల సమావేశ మందిరంలో యూత్ రెడ్‌క్రాస్ క్లబ్ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ-నియంత్రణ అన్న అంశంపై సదస్సు, విద్యార్థులచే పట్టణ పరిధిలో చె%తన్య ర్యాలీ తదితర కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి. ముఖ్యవక్తగా పాల్గొన్న గంజాం జిల్లా యూత్ రెడ్‌క్రాస్ సమన్వ యకర్త ఆర్.సి.హెచ్.జెనా మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా చూస్తే గంజాంలో వ్యాధిగ్రస్థుల సంఖ్య ఎక్కువగా ఉన్నందున జిల్లా యంత్రాంగం, ఇతర స్వచ్ఛంద సంస్థలు చేపట్టిన చైతన్య కార్యక్రమాల గురించి వివరించారు. సదస్సులో కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య చక్రధర్‌పాత్ర్, ఆచార్యులు పితంబర బిశోయి, లక్ష్మణపాలో, దేవీప్రసాద్ పాఢి, బి.కె.రావు, బ్రహ్మపుర సిటీ కళాశాల అచార్యిణి సంఘమిత్ర పట్నాయక్ తదితరులు ప్రసంగించారు.

# వైభవంగా చంద్రశేఖరస్వామి ఊరేగింపు



తిరువణ్ణామలై : తిరువణ్ణామలై అరుణాచలేశ్వరస్వామి ఆలయ కార్తీక మహాదీపోత్సవంలో ఉన్నా మలై సమేత చంద్రశేఖరస్వామి అశ్వ వాహనంపై వైభవంగా విహరిం చారు. ముందుగా విఘ్నేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి మూషిక వాహనంపై ఉదయం ఐరేగించారు. ఆ తర్వాత ఉన్నామలై సమేత చంద్రశేఖరస్వామికి ప్రత్యేక పూజలు అలంకరణ, దీపారాధనలు నిర్వహించి అశ్వవాహనంపై ఆలయ మాడా వీధుల్లో వూరేగించారు. జరగనున్న మహా దీపోత్సవంలో దీపం వెలిగించడానికి కావలసిన వత్తిని తయారు చేయుటకు సిద్ధం చేసిన వస్త్రాలను ఆలయ సిబ్బంది మూడవ ప్రకారంలో ఉన్న సంబంధ వినాయగర్ సన్నిధికి తీసుకు వచ్చారు. అక్కడ ఆ వస్త్రాలకు వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ గజ రాజు రుక్కు ఆ వస్త్రాలను ఆశీర్వదించింది. ముందుగా దీపోత్సవంలో 7వ తేదీ బుధవారం రాత్రి 8.30 గంటలకు పరాశక్తి అమ్మవారిని రథములో ఉంచి ఐరేగించారు. ఆ సమయం నోములు నోచిన మహిళ భక్తులు రథము తాడును లాగారు. అదే సమయంలో చండికే గశ్వరర్‌ను రథంలో ఉంచి పరాశక్తి అమ్మవారి రథం వెంటనే ఐరేగించారు. ఈ రథోత్సవాలు అర్ధరాత్రి ముగిశాయి. వేలాది మంది భక్తులు ఈ రథోత్సవంలో పాల్గొన్నారు.

# జాతీయ ఈత పోటీలో విద్యార్థికి వెండి పతకం



యానాం : యానాం క్రీడాకారుడు డి.వెంకటేష్ ఈత పోటీలో జాతీయ పతకం సాధిం చాడు. నవంబరు 25 నుంచి 29 వరకు దిల్లీలోని తాల్‌కటోరా గార్డెన్స్‌లోని శ్యాంప్రసాద్ ముఖర్జీ ఇంటర్నేషనల్ ఇండోర్ స్విమ్మింగ్ స్టేడియంలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నేషనల్ స్విమ్మింగ్ ఛాంపి యన్‌షిప్ పోటీల్లో యానాంలోని భారత క్రీడాప్రాధికార సంస్థ శిక్షణ కేంద్రం విద్యార్థి డి.వెంకటేష్ (కర్నూలు) వెండి పతకం సాధిం చాడు. 50 మీటర్ల బ్యాక్ స్ట్రోక్ విభాగంలో 31.35 సెకండ్లలో లక్ష్యాన్ని చేరుకొని వెండి పతకాన్ని కైవసం చేసుకున్నాడు. కర్నూలులోని లింగపల్లికి చెందిన రైతు కుటుంబం నుంచి వచ్చిన వెంకటేష్ యానాంలో ఈ ఏడాది జూన్‌లో ఏర్పాటు చేసిన సాయ్ శిక్షణ కేంద్రంలో ఆరు నెలలుగా ఈత నేర్చుకుంటున్నాడు. తొలి ప్రయత్నంలోనే జాతీయ పతకం సాధించడంపై ఈ కేంద్రం నిర్వాహకులతో పాటు స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న వెంకటేష్ అండర్-17 విభాగంలో పాల్గొని ఈ ఘనత సాధించాడు. సాయ్‌లో శిక్షణ పొందుతున్న డ్రీమ్స్ స్కూల్ పదో తరగతి విద్యార్థిని పి.సోనిక 50 మీటర్ల బ్యాక్ స్ట్రోక్ విభాగంలో నాలుగో స్థానం, ఫ్రీస్టైల్‌లో అయిదో స్థాఖనం సాధించింది. వెండి పతకం విజేత డి.వెంకటేష్‌ను, శిక్షణ ఇచ్చిన కోచ్ ఉదయ్‌కుమార్‌ను పుదుచ్చేరి ఆరోగ్య, క్రీడల శాఖల మంత్రి మల్లాడి కృష్ణారావు శ తన క్యాంప్ కార్యాలయం వద్ద సత్కరించారు.

జాతీయ స్థాయిలో పతకం సాధించిన వెంకటేష్‌కు పుదుచ్చేరి ప్రభుత్వం నుంచి నగదు బహుమతి ఇప్పిస్తానని మల్లాడి తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయ్ ప్రతినిధులు ముత్తుకేశవులు, రాయుడు, స్టేడియం ఇన్‌ఛార్జి నక్కల సుబ్బన్న పాల్గొన్నారు.

## జాతీయ పరిశోధన సంస్థలను ఆయా ప్రాంతాల్లోనే కొనసాగించాలి

చెన్నై : రాష్ట్రంలోని మూడు చోట్ల ఏర్పాటైన జాతీయ పరిశోధన కేంద్రాలను అవే ప్రాంతాల్లో కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని టీఎంసీ అధ్యక్షుడు జీకే వాసన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ఓ ప్రకటనలో... తమిళనాడులోని తిరుచ్చి జిల్లా పోదావూర్ గ్రామంలో అరటి పరిశోధన కేంద్రం ప్రారంభమై కొన్నేళ్లుగా కొనసాగుతోందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 300 పైగా అరటి రకాల విత్త నాలను భద్ర పరిచారని తెలిపారు. ఈ పరిస్థితిలో ఆ కేంద్రాన్ని మూసివేసి ఇతర పరిశోధన కేంద్రంతో అనుసంధానం చేయడానికి ప్రయత్నించడం వల్ల అరటి రైతులకు ఎలాంటి ప్రయోజనాలు కలగబోవని పేర్కొన్నారు. చెన్నైలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్రాకిష్‌వాటర్ ఆక్వాకల్చర్, కోయంబత్తూరులోని షుగర్‌కేన్ బ్రీడింగ్ ఇన్‌స్టిట్యూట్ వంటివాటిని దేశంలోని ఇతర రాష్ట్రాల్లో ఉన్న సంస్థలతో అనుసంధానించడానికి ప్రయత్నించడం ఆమోద యోగ్యంకాదని తెలిపారు.

## రహదారి నిబంధనలపై అవగాహన అవసరం



కోయంబత్తూరు : రాష్ట్రంలో గతేడాది రహదారి ప్రమాదాల్లో 17,218 మంది మృతి చెందారని కోయంబత్తూరు ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. ప్రమాదాలు నివారణకు ట్రాఫిక్ పోలీసులు అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహి స్తున్నట్లు తెలిపారు. రోడ్డు నిబంధనలు, శిరస్త్రాణం తదితర అంశా లను తెలియ పరస్తున్నట్లు వెల్లడించారు. మహానగరం రాజవీధిలోని బాలికల ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో 11, 12వ తరగతి విద్యార్థులకు రోడ్డు నిబంధనలుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

## మండీల ప్రారంభం

కె.సింగ్‌పూర్ : కె.సింగ్‌పూర్ పీడబ్ల్యూడీ బంగ్లా ప్రాంగణంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని (మండీ) అధికారులు ప్రారంభించారు. కె.సింగ్‌పూర్ మండీలో 33 వేల క్వింటాళ్లు, బుడాగుడలో 33 వేలు, మజ్జిగూడ మండీల్లో 22 వేల క్వింటాళ్ల ధాన్యాన్ని రైతులు నుంచి సేకరి స్తారని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎంసీ అధికారులు, ల్యాంప్స్ అధికారులతో పాటు మిల్లు యజమానులు, రైతు నాయకులు చింతలి నాగేశ్వరరావు, ధనుసింగ్ కద్రక తది తరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాలలో ధాన్యం మండీలు ప్రారంభం

గుణుపురం: జిల్లాలో వెనుకబడిన ప్రాంతం గుడారి సమితిలో పలుచోట్ల ధాన్యం మండీలు ప్రారంభించారు.

గుడారికి 15 కి.మీ. దూరం సిరిగుడలో ధాన్యం మండీని ప్రారంభించారు.

## పారదర్శకంగా పింఛను పంపిణీకి చర్యలు

విల్లివాక్కం : లబ్ధిదారులకు పింఛను సక్ర మంగా అందజేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వారికి ఏటీఎం కార్డులు పంపిణీ అంశాన్ని పరిశీలిస్తున్నారు. ఇందుకు గాను సాధ్యాసాధ్యాలను తెలుసు కోవడానికి చెన్నై కలెక్టర్ నేతృత్వంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు కానుంది. రాష్ట్ర ప్రభుత్వ సామాజిక భద్రతా పథకం ద్వారా వితంతువులు, వృద్ధులు, ప్రత్యేక ప్రతిభావంతులకు నెలకు రూ. వెయ్యి చొప్పున పింఛనును ప్రభుత్వం అందజేస్తోంది. చెన్నైలో 1.59 లక్షల మంది ఇలా లబ్ధి పొందుతున్నారు. ప్రారంభంలో ఇళ్లకే వెళ్లి తపాలా శాఖ వారు పింఛను అందజేశారు. రాజకీయ నాయకుల జోక్యం, తపాలా శాఖ సిబ్బందే అవినీతికి పాల్పడడంతో బ్యాంకుల ద్వారా పింఛను అందజేయాలని ప్రభుత్వం తీర్మానించింది. ఆ ప్రకారం వెయ్యి మందికిపైగా బ్యాంకు ఏజంట్‌ల ద్వారా అందిస్తోంది. ఇందుకుగాను లబ్ధి దారులకు బ్యాంకు ఖాతాలు ప్రారంభించారు. పాఠశాలలు, నగరపాలక సంస్థ కార్యాలయాలు, మైదానాలకు లబ్ధిదారులను రప్పించి యంత్రాల ద్వారా వేలి ము్రఇలు తీసు కుని బ్యాంకు ఏజంట్‌లు పింఛను ఇస్తున్నారు. ఇందులో కూడా పలు అవకతవకలకు పాల్ప డ్డారు. వేలి ముద్రలు యంత్రంలో సక్ర మంగా నమోదు కాలేదని, పింఛను బ్యాంకులో జమ కాలేదంటూ పలు కారణాలు చెప్పి రూ.కోట్లు కాజేశారనే ఆరోపణలు వచ్చాయి. చెన్నై నగర వ్యాప్తంగా పలుప్రాంతాలలో లబ్ధిదారులు ఆందోళనకు కూడా దిగారు. చెన్నై కలెక్టర్, బ్యాంకులు, పోలీసులకు వీటిపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో కలెక్టర్ నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేసి ఫిర్యాదులపై విచారణ చేపట్టారు. వెలుగు చూసిన సమాచారం మేరకు తండయారుపేటలో సర్కిల్‌లో నగదు బట్వాడా చేస్తున్న సతీష్, మహీరా, నఫాసా భాను, విజయలక్ష్మి, మైలాపూరు సర్కిల్‌లో కిరణ్‌కుమార్‌ను అరెస్టు చేశారు. నేరుగా లబ్ధిదారుల ఖాతాలో పింఛను జమ చేయలని తీర్మానించారు. దీనికోసం వారికి ఏటీఎం కార్డులు ఇవ్వనున్నారు. సాధ్యా సాధ్యాలను పరిశీలించి నివేదిక సమర్పించడానికి చెన్నై కలెక్టర్ అన్బుసెల్వన్ నేతృత్వంలో కమిటీ ఏర్పాటైంది. ఈ కొత్త పథకంలో లబ్ధిదారులు ఏడాదికి ఒక సారి లైఫ్ సర్టిఫికెట్ అందజేస్తే చాలు. నడవలేని వృద్ధులకు మాత్రం బ్యాంకు ఏజంట్‌ల ద్వారా ఇంటికి వెళ్లి పించ=ను అందజేయాలని తీర్మానించారు. ఇప్పటికే దీనిపై కొన్ని బ్యాంకులతో చర్చలు జరుపుతున్నారు. వచ్చే నెలలో కొత్త పథకం అమలులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు.

# 15 అర్ధరాత్రి నుంచి రాష్ట్రంలో లారీల సమ్మె



కటక్ : ప్రభుత్వ నిర్లక్ష్యం, పోలీసులు, రవాణా అధికారుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఈ నెల 15వ తేదీ అర్ధరాత్రి నుంచి రాష్ట్రంలో లారీల సమ్మె చేపడతామని, రెండు లక్షల లారీల సేవలు నిలిపివేస్తామని, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే లారీలు కూడా సమ్మెలో పాల్గొంటాయని రాష్ట్ర లారీల యజమానుల సంఘం కార్యదర్శి రబీనారాయణ సేనాపతి తెలిపారు. కటక్‌లో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 11 డిమాండ్ల పరిష్కారానికి ఈ ఆందోళన చేపడుతున్నట్లు చెప్పారు. 14 ఏళ్లకంటే పాత లారీలపై ప్రభుత్వం కొత్తగా గ్రీన్‌టాక్స్ పేరిట ఏడాదికి రూ.4 వేలు పన్ను చెల్లించాలని కోరిందని, రాష్ట్రంలో జాతీయ రహదారులపై తనిఖీల గేట్లు తొలగించినా రవాణాశాఖ అధికారులు గేట్ల వద్ద తనిఖీల పేరిట అనధికారంగా లారీ డ్రైవర్ల వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం లారీల యజమానులతో సంప్రదించకుండా పన్నులు పెంచుతోందని ఆరోపించారు. 2008లో ప్రభుత్వం లారీల కిరాయి ధర నిర్ధారించిందని, తొమ్మిదేళ్లుగా అదే ధరలతో సరకు రవాణా చేస్తున్నామన్నారు. ఈ సమయంలో డీజిల్ ధర రెండొంతులు పెరిగిందని, కిరాయి ధర సవరించాలని రాష్ట్ర రవాణాశాఖ మంత్రికి ఎన్నిసార్లు విన్నపించినా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. మార్గాల్లో పోలీసులు లారీలను నిలిపివేసి తనిఖీలు పేరిట ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. ప్రభుత్వం 15 రోజుల్లో డిమాండ్లపై స్పందించకపోతే ఆందోళన తప్పదన్నారు. విలేఖరుల సమావేశంలో సంఘం అధ్యక్షుడు బి.పి.దాస్, కార్యనిర్వహణ అధ్యక్షుడు బి.కె.మిశ్ర, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# కాశీక్షేత్రంలో యతికి భిక్షపెడితే వెయ్యిమందికి అన్నదానం చేసినట్లే..

## కాశీ క్షేత్రంలో శారదాపీఠ శాఖాభవనం ప్రారంభం

## విశాఖ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి





విశాఖపట్నం: కాశీ క్షేత్రంలో ఒకసారి యతి భిక్ష (అన్నదానం) నిర్వహిస్తే వెయ్యి మంది బ్రాహ్మణులకు అన్నసమారాధన చేసిన ఫలితం కలుగుతుందని షణ్మత స్థాపనాచార్య జగద్గురు శంకరాచార్య విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి పేర్కొన్నారు. ఆదివారం కాశీ క్షేత్రంలో గంగా స్నానమాచరించిన అనంతరం కాశీ విశ్వేశ్వరుని, శ్రీ విశాలాక్షి అమ్మవారిని, శ్రీ అన్నపూర్ణా దేవిని దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో శ్రీచరణులను అధికారులు ఆహ్వానించారు. శ్రీ శారదా పీఠాన్ని దేశం నాలుగు చెరగులా విస్తరింపజేయాలనే ఉద్దేశ్యంతో కాశీలో కూడా శ్రీ శారదా పీఠ శాఖా భవనం (బ్రాంచి)ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కాశీలో గల దండీ స్వాములను ఆహ్వానించి నూతన శాఖాభవనంలో యతిభిక్ష నిర్వహించారు. వారిని విశేషంగా సత్కరించి దక్షిణలు అందజేశారు. ఈ సందర్భంగా మహాస్వామి వారు అనుగ్రహ భాషణం చేస్తూ పీఠం నిర్వాహకులకు మరియు ట్రస్టీలకు వారణాసిలో నివసించే దండీ స్వాములకు వారానికి ఒకసారి యతిభిక్ష నిర్వహించాలని సూచించారు. శ్రీ దత్త జయంతి సందర్భంగా శారదాపీఠం శాఖా భవనంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శారదాపీఠం ట్రస్టీ రొబ్బి శ్రీనివాస్, ధర్మాధికారి జి. కామేశ్వరరావు, ఆస్థాన పండితుడు కృష్ణ శర్మ, కాశీ శాఖాభనవం మేనేజర్ పి. కిషోర్ కుమార్, ఆంధ్రా ఆశ్రమం మేనేజింగ్ ట్రస్టీ వివి సుందర శాస్త్రి, వివి సీతారామం, ప్రముఖ న్యాయవాది వై. నీలలోహిత్, కాశీలో గల కరివేణ సత్రం మేనేజర్ శ్రీనివాస్, కాశీవాసులు మరియు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వైభవోపేతంగా మార్గశిరమాసోత్సవాలు



విశాఖపట్నం: నగరంలో గల శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో 19వ తేదీనుంచి ప్రారంభమైన మార్గశిరమాసోత్సవాలు సందర్భంగా అమ్మవారికి శ్రీచక్ర నవావర్ణార్చన, లక్ష్మి హెూమం, వేదపారాయణ, సప్తశతీ పారాయణ, మహావిద్యా పారాయణము నిర్వహించుట జరిగినది. ఆదివారం పౌర్ణమి దినం కావడం, సెలవు రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని విరివిగా దర్శించుకుని తరించారు.

శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

విశాఖపట్నం జిల్లా కలెక్టర్ & మేజిస్ట్రేట్ ప్రవీణ్ కుమార్ సతీసమేతంగా శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ సాంప్రదాయం ప్రకారం పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వీరిచే అమ్మవార్కి విశేష పూజ జరిపింది. వేద ఆశీర్వచనంతో అమ్మవారి ప్రసాదం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్‌జె. మాధవి, ధర్మకర్తల మండలి చైర్మన్ డబ్ల్యు భాస్కరరావు, ధర్మకర్తలు రావి చలపతిరావు, సిహెచ్. దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

అన్నదానం

ప్రతీ రోజు నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో భక్తులు సుమారు 3000మంది భక్తులకు నిర్వహించడం జరిగింది.

సాంస్కృతిక కార్యక్రమాలు

మార్గశిర మాసోత్సవాలు నెల రోజుల పాటు అనగా 19-11-2017 నుండి 18-12-2017 వరకు సాయంత్రం 7 గంటల నుండి 9 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయబడినవి. ఇందులో భాగంగా ఆదివారం నంది అవార్డు గ్రహీత బివిఎ నాయుడుచే గయోపాఖ్యానం పౌరాణిక డ్రామా ఆహూతులను అలరించింది. సోమవారం కనక మహాలక్ష్మి వారిచే భరతనాట్యం ఏర్పాటు చేయడమైనదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి ఎస్‌జె మాధవి, సహాయ కార్యనిర్వహణాధికారి పి. రామారావు, ఎస్. సూర్యకుమారి, పర్యవేక్షకులు పి. శ్రీనివాస్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.



గ్రేటర్ విశాఖ 28వ వార్డు అల్లిపురం వెంకటేశ్వర మెట్టపై వెలసిన బలిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారికి సీతమ్మధార నివాసి మట్టా రత్నహర్ష తన జన్మదినం సందర్భంగా స్వామి వారికి 140 గ్రాముల బంగారు హారాన్ని కానుకగా సమర్పిస్తున్న దృశ్యం. ఈ హారాన్ని ఆలయ ఇఓ శిరీషకు అందజేశారు. ఈ కార్యక్రమానికి ఆధ్యాత్మికవేత్త రాజశేఖర్, జి అనంత్ పాల్గొన్నారు.

# నేడు ఆర్కేబీచ్‌లో నౌకాదళ దినోత్సవం

సింధియా: డిసెంబరు 4న భారత నౌకాదళ దినోత్సవాన్ని ఆర్కేబీచ్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు సాగుతున్నాయని నౌకాదళ అధికారులు తెలిపారు. ఇప్పటికే ముందస్తు సన్నాహక విన్యాసాలు ముమ్మరంగా సాగుతున్నాయని ఈ నెల 3న విన్యాసాలు జరిగాయని తెలిపారు. నాలుగో తేదీన జరపనున్న విన్యాసాల్లో ఎయిర్‌క్రాఫ్ట్‌లు పాల్గొంటాయని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో రాబోయే రెండు రోజుల పాటు సాగరతీరంలో ఎలాంటి తినుబండారాలను వేయరాదని, అలా వేస్తే వాటిని తినేందుకు వచ్చే పక్షులతో ఎయిర్‌క్రాఫ్ట్‌లకు అవరోధం ఏర్పడుతుందన్నారు. నగర పౌరులు నేవీ విన్యాసాలకు పూర్తి సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.

# పార్టీ విజయానికి ప్రతీ కార్యకర్త శ్రమించాలి

## మాజీ మంత్రి ధర్మాన ప్రసాద రావు





గాజువాక : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ అధికారాన్ని హస్తగతం చేసుకునేందుకు ప్రతి కార్యకర్త శ్రమించాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు పిలుపునిచ్చారు. ఆదివారం గాజువాక ఆటోనగర్ సమీపంలోని శిక్షణ తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధర్మాన మాట్లాడుతూ ఏడాదిలో ఎన్నికలకు సిద్ధం కావాలన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులు, పేదలకు అందేలా కృషి చేయాలన్నారు. అవసరమైతే పథకాలు ప్రజలకు చేరేందుకు ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలన్నారు. రాజ్యసభ సభ్యులు, పార్టీ కేంద్ర కమిటీ నాయకుడు విజయసాయిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని బూత్ కమిటీ నాయకుల కృషి పార్టీ పటిష్టతకు అవసరమన్నారు. బూత్‌లెవెల్ నుంచి పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. తొలుత పార్టీ జెండాను మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, తైనాల విజయకుమార్, మళ్ల విజయప్రసాద్‌లతో కలిసి ఆవిష్కరించారు. శిక్షణా తరగతులను విజయసాయిరెడ్డి జ్యోతి ప్రజ్వలనం చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు మళ్ల విజయప్రసాద్, తైనాల విజయకుమార్, కరణం ధర్మశ్రీ, నాగిరెడ్డి, తిప్పల గురుమూర్తిరెడ్డి, కొయ్య ప్రసాద్‌రెడ్డి, గుడివాడ అమర్‌నాధ్ తదితరులు పాల్గొన్నారు.

## మానసిక, శారీరక వికలాంగులకు

# సమాజంలో అందరితో సమానంగా తీర్చిదిద్దుతున్నందుకు అభినందనీయం

## జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ లాలం భవాని



విశాఖపట్నం : మానసిక, శారీరక వికలాంగులగా జన్మించిన పిల్లలకు తల్లిదండ్రులు మరింత ప్రేమను కనబరిచి వారిని సమాజంలో అందరితో సమానంగా తీర్చిదిద్దుతున్నందుకు వారందరిని ప్రత్యేకంగా అభినంది స్తున్నానని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ లాలం భవాని అన్నారు. ఆదివారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా ఆంధ్రా యూనివర్శిటీ డా.బి.ఆర్.అంబేద్కర్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన కావించి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 1,32,586 మంది విభిన్న ప్రతిభావంతులు ఉన్నారని అన్నారు. ప్రభుత్వపరంగా వారికి అందాల్సిన సంక్షేమ ఫలాలను అమలు చేయడం జరుగుచున్నదని, 2016 సంవత్సరంలో 64మంది విభిన్న ప్రతిభావంతులకు పలు ప్రభుత్వ శాఖలలో బ్యాక్‌లాగ్ ఉద్యోగ నియా మకాలను కల్పించడం జరిగిందని, 2017 సంవత్సరానికి సంబంధించి 55 పోస్టులను త్వరలో భర్తీ చేయనున్నట్లు తెలిపారు. వీరిలో అంతర్గతంగా వున్న ప్రతిభను వెలికితీయడానికి తల్లిదండ్రుల కృషితో పాటు స్వచ్ఛంద సంస్థలు పాటుపడుతున్నాయని వారందరికి తన ప్రత్యేక అభినందనలు తెలియ జేస్తున్నానన్నారు. జాయింట్ కలెక్టర్-2 డా.సిరి మాట్లాడుతూ స్వయంగా విభిన్న ప్రతిభావంతులే పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించి అందరినీ ఆకట్టుకుంటున్నారని వారందరికి శుభాకాంక్షలన్నారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ అసిస్టెంట్ డైరక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున అమలు చేస్తున్న పథకాలన్నింటిని అందించడం జరుగుచున్నదన్నారు. వికలాంగ సహకార సంస్థ ద్వారా ఉపకరణాలను మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఇటీవల జిల్లా స్థాయి ఆటల పోటీలలో గెలుపొందిన విజేతలు రాష్ట్రస్థాయిలో కూడా పలు పతకాలను సాధించారన్నారు. పలు స్వచ్ఛంద సంస్థలకు చెందిన విభిన్న ప్రతిభావంతులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. క్రీడలలో గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు, మెడల్స్, వికలాంగ దంపతులకు చెక్కుల పంపిణీ, స్వయం ఉపాధి కొరకు రుణాల చెక్కులు తదితరాలను ముఖ్య అతిధులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సిఇఓ జయప్రకాష్ నారాయణ్, ఎన్‌టిపిసి డిజియం రాంబాబు, పలు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఫ్యాషన్ రంగంపై.. సాగరతీరాన

# మెరుపు తీగలు.. హెుయలొలికే భామలు



విశాఖపట్నం: సాగర తీరం సొగసులకు భామలు మరింత సొగసులు అద్దారు. చూడచక్కని హావభావాలతో ఫ్యాషన్ రంగానికి బ్రాండ్ అంబాసిడర్ మేమేనంటూ ఆత్మవిశ్వాసంతో అడుగుపెట్టి అందగత్తెలకు ఆత్మస్థైర్యాన్ని నింపారు. స్మార్ట్ సిటీ రేసులో పరుగులు పెడుతున్న విశాఖలో వీకేండ్ వచ్చిందంటే చాటు మేరుపుతీగల్లా విశాఖ వాకిట్లో వాలిపోయే భామల అడావుడే కన్పిస్తోంది. విశాఖలో ఓ హెూటల్ లో నిర్వహించిన ఫ్యాషన్ షో ఉషస్సు అందరహెూ అనిపించింది. జంటనగరాలుగా పెరుగాంచిన హైదరాబాద్ ప్రాంతానికి చెందిన సాదన ఇనిస్ట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెన్స్ ఆద్వర్యంలో నిర్వహించిన ఇండియా ఫ్యాషన్ వీక్ అందగత్తెలు క్యూ కట్టారు. అంతర్జాతీయ స్దాయిలో జరిగే ఈవేంట్స్‌కు తీసిపోని రీతిలో జరిగిన ఫ్యాషన్ షోకు అతిరద మహారదుల రాకతో మరింత సందడిగా మారింది. నేటి తరం యువత కోరుకునే రీతిలో ఫ్యాషన్ రంగంలో తమ కంటూ ప్రత్యేక గుర్తుంపును సాదించలానే పట్టుదలతో ముందుకొస్తున్న యువతులకు మేమన్నామనే భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ఫ్యాషన్ వీక్ లాంటి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇదే కాకుండా ఫ్యాషన్ రంగంపై అందగత్తేలకు ఉన్న ఆశక్తిని వెలికితీసేందుకు నిర్వహిస్తున్న ఫ్యాషన్ షోలకు మంచి ఆదరణ వస్తుందని అన్నారు. ప్రతీ ఏటా నిర్వహిస్తున్న ఫ్యాషక్ వీక్‌లో బాగంగా విశాఖలో జరిగిన ఫ్యాషన్ షో అందగత్తేల హావభావాలను చాటి చెప్పేందుకు మంచి వేదికకగా నిలిచింది. ఫ్యాషన్ రంగంపై ఆశక్తిని పెంపోందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహపడతాయని ఈ సందర్భంగా నిర్వాహకులు అరుణ గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమలో కరణ్ వాజ్, ఐశ్వర్య సత్య , ఆశిషి క్రిష్ణ, అనిషా నాయుడు తదితరులు పాల్గోన్నారు.

# చిరస్మరణీయులు బాబు రాజేంద్రప్రసాద్

## నగర కాంగ్రెస్ కార్యదర్శి కె.గోపాల్ రెడ్డి



వృద్ధులకు పాలు, రొట్టెలు పంపిణీ చేస్తున్న కె గోపాల్‌రెడ్డి

విశాఖపట్నం: చిరస్మరణీయులు బాబు రాజేంద్రప్రసాద్ అని నగర కాంగ్రెస్ కార్యదర్శి కె.గోపాల్ రెడ్డి అన్నారు. దేశ తొలి రాష్ట్రపతి డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్ 133వ జయంతి సందర్భంగా ఆదివారం 31వ వార్డు జగన్నాథ పురం వృద్ధాశ్రమంలో వృద్ధులకు పాలు, రొట్టెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ దేశ తొలి రాష్ట్రపతిగా బాబు రాజేంద్రప్రసాద్ పనిచేసి దేశ ప్రజల హృదయాలలో చిరస్మరణీయంగా నిలిచి పోయారని అన్నారు. బాబు రాజేంద్రప్రసాద్ అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షులుగా కూడా పనిచేశారని చెప్పారు. స్వతంత్ర సంగ్రామంలో కూడా ఆయన పోరాట పటిమ అనిర్వ చణీ యమని అటువంటి మహానీయుడు జయంతి జరుపుకోవడం ఆనం దంగా ఉందని అన్నారు. సేవా కార్యక్రమాలు ప్రతివారం కూడా నిర్వహి స్తామని అన్నారు. కార్యక్రమాలు నిర్వహిం చడానికి ప్రోత్సహిస్తున్న పీసీసీ ప్రధాన కార్యదర్శి ద్రోణంరాజు శ్రీనివాస రావు, నగర కాంగ్రెస్ అధ్యక్షులు బెహరా భాస్కరరావులకు కృతజ్ఞతలు తెలియజేస్తు న్నానని అన్నారు. సేవా కార్యక్రమాల ద్వారా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమం సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విజయభాను సంపాదకీయం

## సూక్తులు నినాదాల వరకే..

మహిళలు కూడా పురుషులతో సమానమేనని, ఎక్కడ మహిళలు పూజింపబడతారో అక్కడ దేవతలుంటారని, సూక్తులు, నినాదాల వరకే పరిమితమైన సమాజంలో ఇప్పటి వరకు పరివర్తన చోటు చేసుకోలేదు. కానీ తెలంగాణ ప్రభుత్వం క్రియాశీలంగా వ్యవహరిస్తూ మహిళల అభివృద్ధి కోసం నిర్దిష్టమైన చర్యలు తీసుకుంటున్నది. సామాజిక వర్గాలవారిగా అభివృద్ధికి నిధులు కేటాయిస్తూ సమతుల అభివృద్ధి సాగించడానికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తున్నది. హైదరాబాద్ సరికొత్త సిలికాన్ వ్యాలీ. అటువంటి ఇంద్రజాల శక్తి హైదరాబాద్‌కే ఉన్నది- ప్రపంచ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల సదస్సును దిగ్విజయంగా జరిపిన తరువాత నీతి ఆయో గ్ సీఈవో అమితాబ్ కాంత్ ఇచ్చిన ప్రశంస ఇది! హైదరాబాద్ మహానగరంలో అత్యంత సమర్ధవంతంగా ఈ సదస్సును నిర్వహించిన తీరుకు అమితాబ్ కాంత్ మాత్రమే కాదు, ప్రపంచం నలుమూలల నుంచి విచ్చేసిన మహామహులంతా సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. కలిసొచ్చే కాలానికి నడిచొచ్చిన కొడుకు అన్నట్టు- 21వ శతాబ్దపు ఆర్థిక శక్తిగా అవతరిస్తున్న తరుణంలో భారత్‌కు తెలంగాణ రాష్ట్రమే ముందుండి దారి చూపుతుందని హైదరాబాద్ సదస్సును తిలకించిన వారు భావించక తప్పని పరిస్థితి ఏర్పడ్డది. మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడమే ప్రధానాంశంగా ఈ సదస్సు సాగిన నేపథ్యంలో, తెలంగాణ ప్రభుత్వం కూడా తదనుగుణమైన చర్యలను తీసుకోవడం హర్షణీయం. టీ- హబ్ మాదిరిగానే మహిళా పారిశ్రామికవేత్తలకు తోడ్పడటానికి విమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ హబ్ (వి హబ్)ను ఏర్పాటు చేస్తున్నట్టు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ప్రకటించడం అభినందనీయం. మహిళా ఔత్సాహిక పారిశ్రామికులను చేయూత అందించడానికి పదిహేను కోట్లతో ప్రత్యేక నిధిని ఏర్పాటు చేస్తున్నట్టు మంత్రి వివరించారు. ఈ నిధి నుంచి పారిశ్రామికవేత్తలకు 25 లక్షల నుంచి కోటి రూపాయల వరకు నిధులు అందించవచ్చు. ప్రభుత్వ కొనుగోళ్ళలో ఇరువై శాతం సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల నుంచి ఉండాలనే నిబంధన ఇప్పటికే ఉన్నది. ఇందులో నాలుగోవం తు మహిళా పారిశ్రామికవేత్తలకు కేటాయిస్తున్నట్టు మంత్రి వెల్లడించడాన్ని బట్టి రాష్ట్ర ప్రభుత్వం ఎంత స్పష్టంగా ఉన్నదో తెలుస్తున్నది. ప్రపంచ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల సదస్సు ఈ సారి మహిళలను ప్రోత్సహించడంపైనే కేంద్రీకరించింది. ఈ సదస్సు మహిళలకు ప్రాధాన్యం, అందరికి సౌభాగ్యం నినాదాన్ని చేపట్టింది. వివిధ దేశాల నుంచి పదిహేను వందల మంది ఔత్సాహికులు, పెట్టుబడిదారులు హాజరైతే వారిలో సగానికి పైగా మహిళా ప్రతినిధులే. పది దేశాల నుంచి మొత్తం మహిళా ప్రతినిధులే హాజరయ్యారు. మూడోవంతు మహిళలు ముప్ఫై ఏండ్ల లోపు వారే కావడాన్ని బట్టి రాబోయేతరాల్లో ఉన్న ఉత్సాహం తెలుస్తున్నది. నీతి ఆయోగ్ కూడా మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడానికి నిర్దిష్ట పథకాన్ని రూపొందిస్తామని ప్రకటించింది. అయితే కుటుంబంలో, సమాజంలో మహిళా సమానత్వమే ఆశించిన స్థాయిలో సాధ్యం కావడం లేదు. పారిశ్రామిక రంగంలో ముందడుగు వేయ డం అంత సులభం కాదు. ప్రపంచ వ్యాప్తంగా మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తల విషయమై జరిగిన అధ్యయనాలలో ఇందుకు అవాంతరాలు ఎంతగా ఉంటాయో వెల్లడైంది. మహిళలకు కుటుంబాల ఆమోదం, సామాజిక మద్దతు తక్కువగా ఉంటుంది. బ్యాంకులు రుణాలివ్వడానికి సం కోచిస్తాయి. వారసత్వంగా పరిశ్రమాధిపతులుగా మారడం వేరు. కానీ ఔత్సాహిక పారిశ్రామికులుగా ఎదగడం ఎదురీతగా చెప్పవచ్చు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన వి-హబ్ మహిళలకు ఎంతో ఉపయుక్తమైనది. వ్యక్తిగత ఆసక్తికి వ్యవస్థాగత మద్దతు లభించినప్పుడే మార్పు సాధ్యపడుతుంది మహిళలు కూడా పురుషులతో సమానమేనని, ఎక్కడ మహిళలు పూజింపబడతారో అక్కడ దేవతలుంటారని, సూక్తులు, నినాదాల వరకే పరిమితమైన సమాజంలో ఇప్పటి వరకు పరివర్తన చోటు చేసుకోలేదు. కానీ తెలంగాణ ప్రభుత్వం క్రియాశీలంగా వ్యవహరిస్తూ మహిళల అభివృద్ధి కోసం నిర్దిష్టమైన చర్యలు తీసుకుంటున్నది. సామాజిక వర్గాలవారిగా అభివృద్ధికి నిధులు కేటాయిస్తూ సమతుల అభివృద్ధి సాగించడానికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తున్నది. దళితులు, గిరిజనుల ఉప ప్రణాళికలను పకడ్బందిగా అమలు చేయడం ఇందులో భాగమే. మహిళలు ధైర్యంగా బయటకు రావడానికి భద్రత ఉండాలె. విద్యాభివృద్ధి జరుగాలె. వేధింపులను అరికట్టడానికి షీ టీమ్స్ పెట్టడం మొదలుకొని గురుకులాలు నెలకొల్పడం వరకు రాష్ట్ర ప్రభుత్వం మహిళల పురోగతికి అనేక చర్యలు తీసుకుంటున్నది.

# ఆర్టీసీ ఉద్యోగులకు ఆధునిక వైద్యం



యశ్వంతపుర: కేఎస్ఆర్టీసీ, బీఎంటీసీ అధికారులు, ఉద్యోగులకు ఆధునిక వైద్య సౌకర్యం కల్పించేందుకు హుబ్బళ్లి, బెళగావి, మైసూరు, దావణగెరె, కలబురగి తదితర ప్రముఖ నగరాల్లో ఆధునిక వైద్య సేవలందించేందుకు ఆసుపత్రుల్ని ప్రారంభిస్తామని ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి రమేష్‌కుమార్ వెల్లడించారు. శనివారం ఇక్కడ మెజిస్టిక్ బీఎంటీసీ, యశ్వంతపుర బీఎంటీసీ బస్టాండ్లలో ఏర్పాటు చేసిన ఇందిరా క్లినిక్‌లను ఆయన, రవాణాశాఖ మంత్రి హెచ్.ఎం.రేవణి, కేపీసీసీ కార్యాధ్యక్షుడు దినేష్ గుండూరావుతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల ఏర్పాటుపై మంత్రివర్గ సమావేశంలో ప్రతిపాదించి అనుమతి పొందే బాధ్యత తనదని తెలిపారు. కె.ఎస్.ఆర్టీసీ, బీఎంటీసీ సంస్థల్లోపని చేసే అధికారులు, కండక్టర్లు, డ్రైవర్లు, సిబ్బంది జీవితం అమూల్యమైనదని తెలియజేశారు. ఇలాంటి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల ఏర్పాటు రవాణా సంస్థ నుంచి ప్రారంభం కావాలన్నారు. ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యం కల్పించే స్థాయిలో ప్రభుత్వం లేదని, ప్రైవేట్ ఆసుపత్రులు వివిధ వైద్య పరీక్షల పేరుతో ఎక్కువ సొమ్ము వసూలు చేస్తున్నారని తెలిపారు. డ్రైవర్లు, కండక్టర్లు వేలాదిమంది ప్రజల్ని గమ్యస్థానం చేర్చుతున్నారని అలాంటి వారికి ఆరోగ్యం ప్రధానమన్నారు. తమ పిల్లల్ని బాగా చదివించి మంచి ఉద్యోగం చేసేలా ప్రయత్నించాలని ఆయన సిబ్బందికి సూచించారు. మంత్రి హెచ్.ఎం.రేవణ? మాట్లాడుతూ ఇందిరాగాంధీ పేరుతో రెండు బస్టాండ్లలో క్లినిక్‌లు ప్రారంభించామని, ప్రయాణికులు ఎక్కువగా సంచరించే బస్టాండ్లలో ఇలాంటి క్లినిక్‌ల్ని ప్రారంభిస్తామన్నారు.ఇందిరా క్లినిక్ ఉదయం ఆరుగంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పనిచేస్తుంది. వైద్యుడు, నర్సు, ఇద్దరు సిబ్బందితో పాటు, అత్యసర మందులు, ఒక పడక, ఆక్సిజన్ సిలిండర్ తదితర సౌకర్యాలు ఉంటాయి. అత్యవసర సమయంలో ప్రయాణికులు, సిబ్బందికి తక్షణం వైద్య చికిత్స చేస్తారు.

శాంతినగర, శివాశినగర బస్టాండుల్లో కూడా ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీఎంటీసీ అధ్యక్షుడు నాగరాజు యాదవ్, ఉపాధ్యక్షుడు గోవిందరాజు, ఎండీ పొన్నరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణం తీసిన సిగరెట్



పొన్నేరి: పడకలో సిగరెట్టు కాల్చుతూ నిద్రించిన వ్యక్తి... అగ్ని ప్రమాదంలో చిక్కుకుని మ ృతి చెందిన సంఘటన రెడ్‌హిల్స్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... మాధవరం పొన్నిఅమ్మన్‌మేడు రెండో వీధికి చెందిన రాజేష్ (38) చిరు వ్యాపారి. ఇతనికి భార్య కవిత, కుమార్తె ఉన్నారు. తాగుడు అలవాటును మానుకోవాలని కవిత భర్తను పలుమార్లు కోరినా ఆయనలో మార్పు రాలేదు. విరక్తి చెందిన ఆమె కొద్ది రోజుల కిందట పుట్టింటికి వెళ్లిపోయింది. శుక్రవారం రాత్రి తప్పతాగిన రాజేశ్ ఇంటి పడక గదిలో సిగరెట్ కాల్చుతూ నిద్రించాడు. పడకలో సిగరెట్ పడి నిప్పంటుకుంది. తప్పించేకునే యత్నంలో అతని శరీరానికి నిప్పంటుకుని ఘటనా స్థలంలోనే మ ృతి చెందినట్లు మాధవరం పోలీసులు తెలిపారు. మ ృతదేహాన్ని స్వాధీనం చేసుకుని శవపరీక్షల నిమిత్తం చెన్నై ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

# రాష్ట్రంలో బాలికా విద్యపై ఆరా

## రాష్ట్ర మంత్రులతో తెలంగాణ ఉపముఖ్యమంత్రి శ్రీహరి సమావేశం



గోపాలపూర్: చాలా రాష్ట్రాల్లో బాలికల విద్యా ప్రమాణాలు అంతంతమాత్రంగానే ఉన్నాయని, దీన్ని ద ృష్టిలో ఉంచుకొని కేంద్రానికి తాము త్వరలో నివేదిక సమర్పిస్తామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి తెలిపారు. బాలికల్లో డ్రాపౌట్లపై అధ్యయనానికి సెంట్రల్ అడ్వయిజరీ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ సబ్ కమిటీ అధ్యక్షుని హెూదాలో ఆయన రాష్ట్రానికి వచ్చారు. ఈ సందర్భంగా భువనేశ్వర్ గురుకుల సేవాశ్రమంలో బాలికల విద్యాప్రమాణాలపై ఏర్పాటైన ప్రిన్సిపాళ్ల సదస్సును ఆయన ప్రారంభించారు. రాష్ట్ర ఉన్నత, ప్రాథమిక విద్యాశాఖ మంత్రులు అనంతదాస్, బద్రినారాయణ పాత్ర్, ఇతర అధికారులతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో ప్రాథమికస్థాయిలో బాలికల డ్రాపౌట్లు 4.71 శాతం కాగా, ఉన్నతస్థాయిలో ఇది 4.43 శాతంగా ఉందని మంత్రులు ఆయనకు వివరించారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని కస్తూర్బా ఆవాసిక విద్యాలయాల స్థాయి ప్లస్‌టు వరకు పెంచాలని, ప్రతి జిల్లా కేంద్రంలో ఇది ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ ప్రతీ రాష్ట్రంలో మహిళా విశ్వవిద్యాలయాలు ప్రారంభించి ఉన్నత విద్యాప్రమాణాలకు పెద్దపీట వేయాలని సిఫార్సు చేస్తామన్నారు. ముఖ్యంగా బాలికల విద్యలో డ్రాపౌట్లు లేకుండా ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలన్న దానిపై సబ్‌కమిటీ కీలక సూచనలు చేయనుందని వివరించారు.

# సమయం కవి

## స్వార్ధపరులు ప్రజలకు మంచి చేయరు

స్వార్థం అనేది మనిషికి ఉండే దుర్గుణాలలో ఒకటి.
స్వార్థం వీడితే మనిషి మనస్సు దైవత్వంతో నిండిపోతుంది.
అయితే నేడు అందరిలోనూ స్వార్థం ఎక్కువైపోయింది.
దేశాన్ని నడిపించే నాయకులు, అధికారులు స్వార్థంతో దేశప్రగతికి
తూట్లు పొడుస్తున్నారు. నాయకులు, అధికారులు స్వార్థచింతన మానితే
మనదేశం బ్రహ్మాండంగా అభివృద్ధి చెందుతుంది.
తమ వారికి మాత్రమే మేలు జరిగే పథకాలను ప్రవేశపెడుతున్నారు.
తమకు అనుకూలమైన చట్టాలు చేస్తున్నారు. ఆ పార్టీ ఈ పార్టీ
అవి ఏమీ లేదు. అంతా దొంగలే. ఖరీదయిన ఖద్దరు దొంగలు
కాబట్టి మనం నాయకులను ఎన్నుకొనేటప్పుడు
మంచి వ్యక్తిత్వం, సేవా దృక్పథం ఉన్నవారిని ఎన్నుకోవాలి.
అప్పుడు మనకు మేలు కలుగుతుంది. రాజకీయ నాయకులు తమ
విధులను నిజాయితీగా నిర్వర్తిస్తే అధికారులు కూడా
సక్రమంగా పనిచేస్తారు. కానీ నేటి నాయకులు ఎన్నికలలో
విపరీతంగా ధనాన్ని ఖర్చు చేసి అధికారంలోకి వచ్చాక
దానికి పదిరెట్లు ప్రజాధనాన్ని స్వాహా చేస్తున్నారు. ప్రజలు
కూడా నోట్లకి ఓట్లను అమ్ముకుంటున్నారు. స్వార్థపరులగు
రాజకీయ నాయకుల గురించి ఓ శతకకవి ఇలా వ్రాశాడు.

'క్రూరమృగము నడవి గూల్చ వేటయగును
క్రూరు నూర గూల్చ నేరమగును
స్వార్థపరులు చేయు చట్టము లిట్లుండు
త్రిపురనేని వాణి తెలుగుబాణి'

...కవితా రచన
వడ్లమాని అన్నపూర్ణ

# పంచాంగం

మాసం : మార్గశిర; తిథి : బహుళ పాడ్యమి రా.7.56; రోహిణి ఉ.8.32; మ.వ.1.46ల 3.15.

సోమవారం 04-12-2017

**మేషం** : ఆర్థిక విషయాల్లో ఒకడుగు ముందుకు వేస్తారు. క్రయ విక్రయ రంగాలలోని వారికి నూతన ఉత్సాహం కానవస్తుంది. కాంట్రాక్టర్లకు అధికమైన ఒత్తిడి తప్పదు. వాహన విషయంలో సంతృప్తి కానవస్తుంది. స్థిరాస్తి క్రయ విక్రయాలకు సంబంధించి ప్రముఖులతో సంప్రదింపులు జరుపుతారు. **వృషభం** : మీ కళత్ర మొండి వైఖరి, కుటుంబీకుల పట్టుదల మనశ్శాంతిని దూరం చేస్తాయి. ఇంటర్వ్యూలలో శ్రద్ధ వహించండి. విద్యార్థినులు ప్రేమ వ్యవహారాలకు దూరంగా ఉండాలి. విద్యార్థులు ఉన్నత విద్యల కోసం విదేశాలు వెళ్లేందుకు మార్గం సుగమవుతుంది. ఇతరుల ఆంతరంగిక విషయాలలో తలదూర్చకండి. **మిధునం** : రావలసిన బకాయిల విషయంలో మెళుకువ అవసరం. సోదరీ, సోదరులతో ఏకీభావం కుదరదు. ఐరన్, సిమెంట్, కలప రంగాలలో వారికి చికాకులు తప్పవు. కోర్టు వ్యవహారాలు వాయిదా పడటం మంచిదని గమనించండి. లీజు, ఏజెన్సీ, నూతన కాంట్రాక్టులు అనుకూలిస్తాయి. స్నేహ పరిచయాలు విస్తరిస్తాయి. **కర్కాటకం** : ఆహార వ్యవహారాలలో మెళుకువ వహించండి. ఉద్యోగస్తులకు పై అధికారుల నుంచి మంచి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. స్త్రీలకు పనివారలతో ఒత్తిడి, చికాకులను ఎదుర్కొంటారు. మీ యత్నాలకు సన్నిహితుల ప్రోత్సాహం, సహకారం అందిస్తారు. ఖర్చులకు సరిపడు ఆదాయం సమకూర్చుకుంటారు. **సింహం** : మీ ఆదాయానికి మించి ఖర్చులు అధికమవుతాయి. మీ సంతానం చదువుల్లో బాగా రాణిస్తారు. నిర్మాణ పథకాలలో పురోభివృద్ధి కానవస్తుంది. ఉద్యోగస్తులు తోటివారి కారణంగా అధికారులతో మాటపడవలసి వస్తుంది. షేర్ మార్కెట్ రంగాల వారికి సామాన్యం. పండ్లు, పూలు, కూరగాయల వ్యాపారస్తులుకు లాభదాయకం. **కన్య** : లిటిగేషన్ వ్యవహారాలలో జాగ్రత్త వహించండి. ధనం సమయానికి అందుట వలన సంతృప్తి కానవస్తుంది. బంధుమిత్రులతో సంబంధ బాంధవ్యాలు బాగుగా ఉంటాయి. దైవ, పుణ్య, సేవా కార్యక్రమాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. విద్యార్థులు ఉన్నత విద్యల కోసం చేసే యత్నాలు అనుకూలిస్తాయి. ప్రయాణాలు అనుకూలిస్తాయి. **తుల** : కందులు, ఎండుమిర్చి, స్టాకిస్టులు, వ్యాపారస్తులు సంతృప్తి కానవస్తుంది. రవాణా రంగాలలో వారికి మిశ్రమ ఫలితం కానవస్తుంది. రచయితలకు, పత్రికా రంగంలో వారికి కీర్తి, గౌరవాలు పెరుగుతాయి. ప్రేమానుబంధాలు బలపడతాయి. రాజకీయాల్లో వారికి తెలివితేటలకు మంచి గుర్తింపు లభిస్తుంది. **వృశ్చికం** : కుటుంబీకుల నుంచి సమస్యలు తలెత్తే ఆస్కారం ఉంది. ఫ్యాన్సీ, సుగంధ ద్రవ్య, రసాయన వ్యాపారస్తులకు లాభదాయకం. ఉపాధ్యాయులు ఒత్తిడి సమస్యలకు లోనవుతారు. ఎదుటివారు మీకు సమఉజ్జీలేనని గ్రహించండి. గత అనుభవాలు జ్ఞప్తికి రాగలవు. రియల్ ఎస్టేట్ రంగాల వారికి నూతన వెంచర్లు అనుకూలిస్తాయి. **ధనుస్సు** : స్త్రీలకు నూతన వ్యక్తుల పరిచయం ఎంతో ఇబ్బంది కలిగిస్తుంది. మార్కెటింగ్ రంగాల్లో వారికి, పత్రికా, ప్రైవేటు సంస్థల్లో వారికి మార్పులు అనుకూలిస్తాయి. ఊహించని ఖర్చులు వల్ల స్వల్ప ఇబ్బందులు తప్పవు. విద్యార్థులకు అతి ఉత్సాహం వల్ల సమస్యలు తలెత్తుతాయి. **మకరం** : ఉపాధ్యాయులకు ఒక సమాచారం ఆసక్తి కలిగిస్తుంది. స్త్రీలు ప్రముఖుల సిఫార్సుతో దైవ దర్శనాలను త్వరగా ముగించుకుంటారు. నూతన అగ్రమెంట్లు వాయిదా వెయ్యండి. శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది. నిరుద్యోగులు భవిష్యత్ గురించి పథకాలు వేసిన సత్ఫలితాలు పొందుతారు. ఖర్చులు అధికమవుతాయి. **కుంభం** : ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. ప్రముఖులను కలుసుకొని బహుతమతులు అందజేస్తారు. రావలసిన డబ్బు చేతికి అందడం వల్ల ఆర్థిక ఇబ్బంది అంటూ ఉండదు. స్త్రీలు తేలికగా మోసపోయే ఆస్కారం కలదు. **మీనం** : కాంట్రాక్టర్లకు అధికా రులతో అవగాహన కుదరదు. కోర్టు వ్యవహారాల్లో ప్లీడర్లకు, ప్లీడరు గుమస్తాలకు ఒడిదు డుకులు తప్పవు. కొంత మంది మీ సహాయం పొంది మిమ్మల్ని తక్కువ అంచనా వేయటం వల్ల ఆందోళనకకు గురవుతారు.

# ఈ పుష్కరిణిలో స్నానం చేస్తే చాలు!

సంకీర్తన



కొలువైన పరమ పవిత్రమైన క్షేత్రాలలో 'గురువాయూర్' ఒకటి. దేవతల గురువైన బృహస్పతి .. వాయుదేవుడు కలిసి ఇక్కడ కృష్ణుడి మూర్తిని ప్రతిష్ఠించడం వలన ఈ క్షేత్రానికి ఈ పేరు వచ్చింది. ఇక్కడి 'రుద్ర తీర్థం' మహిమాన్వితమైనదిగా చెప్పబడు తోంది. ఈ తీర్థంలో స్నానం చేసినవారు వ్యాధుల నుంచి బయటపడతారనడానికి అనేక నిదర్శనాలు వున్నాయి.

తన తండ్రి 'పరీక్షిత్తు' మహారాజు 'తక్షకుడు' అనే పాము కాటు కారణంగా మరణించడంతో, ఆయన కుమారుడైన 'జనమేజయుడు' సర్పజాతి పట్ల ద్వేషంతో 'సర్పయాగం' చేశాడు. అలా అనేక సర్పాలను చంపిన పాప ఫలితంగా ఆయనకి 'కుష్ఠ వ్యాధి' సంక్రమించింది.

ఆ వ్యాధితో బాధపడుతోన్న ఆయనకి పరశురాముడు తారసపడతాడు.' 'గురువాయూర్'లోని 'రుద్ర తీర్థం'లో స్నానమాచరించమని చెబుతాడు. దాంతో ఆయన శ్రీకృష్ణుడిని ఆరాధిస్తూ అనునిత్యం ఆ తీర్థంలో స్నానమాచరిస్తూ వస్తాడు. ఫలితంగా కొంతకాలానికి అతని వ్యాధి పూర్తిగా తగ్గిపోతుంది. ఇలా ఈ తీర్థంలో స్నానమాచరించి వివిధ రకాల వ్యాధుల బారి నుంచి బయటపడినవాళ్లు ఎంతోమంది వున్నారని చరిత్ర చెబుతోంది.

## ఇక్కడి శిల్పకళ చూసి తీరవలసిందే!

ప్రాచీన క్షేత్రాలను దర్శించినప్పుడు అక్కడి శిల్పకళ అద్భుతమనిపిస్తుంది .. ఆశ్చర్యానందాలను కలిగిస్తుంది. అలా శిల్పకళతో సహా విలసిల్లే క్షేత్రాలలో ఒకటి చిత్తూరు జిల్లా 'సోంపాళ్యం'లో కనిపిస్తుంది. ఇక్కడ ఆవిర్భవించిన చెన్నకేశవస్వామికి విజయనగర రాజులు ఆలయాన్ని నిర్మించినట్టు చరిత్ర చెబుతోంది.

సువిశాలమైన ప్రదేశంలో ఈ ఆలయం నిర్మించబడింది. పొడవైన ప్రాకారాలు .. మంటపాలు .. స్తంభాలు ఆలయ వైభవానికి అద్దం పడుతుంటాయి. గర్భాలయంలో చెన్నకేశవస్వామి .. ప్రత్యేక మందిరంలో లక్ష్మీదేవి పూజలు అందుకుంటూ వుంటారు. ఈ ఆలయంలో గోడలు .. స్తంభాలు .. మంటపాలు అన్నీకూడా అలనాటి శిల్పకళా వైభవాన్ని ఆవిష్కరిస్తుంటాయి.

పురాణ దృశ్యాలతో పాటు ప్రత్యేక శిల్పాలు ఔరా! అనిపించకమానవు. అమరశిల్పి జక్కన్న .. ఆయన శిష్య బృందం ఈ శిల్పాలను మలిచారని చెబుతారు. అందమైన ఆ శిల్పాలను వాళ్లు మలిచింది రాయితోనా .. మైనంతోనా అనే ఆశ్చర్యం కలిగేంతగా ఆ శిల్పకళ ఉంటుంది. స్వామివారి మహిమలతో పాటు .. అలనాటి శిల్పుల అద్భుతమైన శిల్పకళా చాతుర్యం కారణంగా, ఈ క్షేత్రం మరింత విశిష్టతను సంతరించుకుని కనిపిస్తుంది.



# సామాజిక సమస్యలపై జర్నలిస్టుల పాత్ర శ్లాఘనీయం



అరకు ఎం.పి. కొత్తపల్లి గీత

విశాఖపట్నం : సామాజిక సమస్యలపై జర్నలిస్టులు అనుసరిస్తున్న పాత్ర శ్లాఘనీయమని అరకు లోక్‌సభ సభ్యురాలు కొత్తపల్లి గీత అన్నారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ మహావిశాఖ నగర శాఖ ముడసర్లోవ పార్కులో ఏర్పాటుచేసిన వనమహోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై జర్నలిస్టులు, వారి కుటుంబసభ్యులనుద్దేశించి ప్రసంగించారు. నిర్భయ కేసులో జర్నలిస్టులు అసాధారణ ప్రజ్ఞాపాటవాలు ప్రదర్శించారన్నారు. జర్నలిస్టులు నిరంతరం కష్టించి పనిచేస్తూ అనేక ఇబ్బందులకు గురౌతున్నారని వారికి ప్రభుత్వం గృహవసతి కల్పించాలని కోరారు. తెలుగుదేశం పార్టీలో తాను చేరుతున్నట్టు మీడియాలో వస్తున్న వార్తలను ఆమె ఖండించారు. ప్రస్తుతం తాను ఏ పార్టీ కండువాను కప్పుకోదలుచుకోలేదని ప్రజలకు సేవచేసేందుకు అధిక ప్రాధాన్యతనిస్తున్నట్టు చెప్పారు. అరకు లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ప్రతి గ్రామంలోనూ అభివృద్ధిపనులు చేపడుతున్నామని తెలిపారు. పలు సమస్యలపై పార్లమెంటులో ప్రశ్నల వర్షం కురిపించినట్లు గీత చెప్పారు. వనమహోత్సవానికి అధ్యక్షత వహించిన ఎ.పి.డబ్ల్యూ.జె.ఎఫ్. రాష్ట్ర కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా వనమహోత్సవాన్ని నిర్వహించామని జర్నలిస్టుల సంక్షేమమే ఎ.పి.డబ్ల్యూ.జె.ఎఫ్. ధ్యేయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు ప్రకటిస్తున్న రాయితీలు అక్రిడేషన్ జర్నలిస్టులకు మాత్రమే అందనున్నాయని ఈ నేపథ్యంలో పతి జర్నలిస్టు అక్రిడేషన్ కార్డు పొందేలా చూసుకోవాలని కోరారు. జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం స్పందిస్తూనే వున్నామని, పిక్నిక్‌ల ద్వారా జర్నలిస్టుల కుటుంబసభ్యుల మధ్య అవినాభావ సంబంధం ఏర్పడుతోందన్నారు. ఎ.పి.డబ్ల్యూ.జె.ఎఫ్. నగర శాఖ అధ్యక్షులు పి. నారాయణ్ మాట్లాడుతూ నిరంతరం మానసిక ఒత్తిడికిలోనయ్యే జర్నలిస్టులు వారి కుటుంబసభ్యుల సౌలభ్యం ఆటవిడుపుగా ఈ వనమహోత్సవాన్ని ఏర్పాటుచేశామని చెప్పారు.

జర్నలిస్టుల సంక్షేమం కోసం ఎ.పి.డబ్ల్యూ.జె.ఎఫ్. నిరంతరం పాటుపడుతోందని, మున్ముందు మరిన్ని మంచి కార్యక్రమాలు చేపట్టనున్నట్టు వెల్లడించారు. ఈ వనమహోత్సవంలో సెంచూరియన్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య జి.యస్.ఎన్. రాజు, సీనియర్ జర్నలిస్టులు జి. ఉమాకాంత్, సూరంపూడి వీరభద్రరావు, వి.జె.ఎఫ్. కార్యదర్శి ఎస్. దుర్గారావు, ఎ.పి. బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ అధ్యక్షులు ఈరోతి ఈశ్వరరావు, ఎ.పి.డబ్ల్యూ.జె.ఎఫ్. ఆర్గనైజింగ్ సెక్రటరీ డి. రవికుమార్, కోశాధికారి బి. సీతారామమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. ఎ.పి.డబ్ల్యూ.జె.ఎఫ్. కార్యవర్గసభ్యులు టి. బంటయ్యకుమార్తె టి. ఝాన్సీలక్ష్మి అసాధారణ నృత్యప్రదర్శనకు గాను కొత్తపల్లి గీత ఆ బాలికను ఘనంగా సన్మానించారు. ఈ వనమహోత్సవానికి 400 మందికి పైగా జర్నలిస్టుల, వారి కుటుంబసభ్యులు హాజరయ్యారు.

# శ్రీ మహాకామేశ్వరీ పీఠంలో మార్గశిర మాస పౌర్ణమి పూజలు



విశాఖపట్నం : పెందుర్తి సాధుమఠం దరి శ్రీమహాకామేశ్వరీ పీఠంలో మార్గశిరమాస పౌర్ణమి పూజలు, కనకధారా మహాయజ్ఞము మహర్షి యద్దనపూడి అయ్యన్నపంతులు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ముందుగా భక్తుల చేత గోపూజ నిర్వహించారు.


మార్గశిరమాసం సందర్భంగా కనకధారా మహాయజ్ఞము నిర్వహించారు. లక్ష్మీ అమ్మవారికి పంచామృతాభిషేకాలు, రుద్రాభిషే కము, అఖండ క్షీరాభిషేకము నిర్వహించారు.

తదనంతరం అమ్మవారికి పట్టు పీతాంబరాలు సమర్పించారు. పౌర్ణమి సందర్భంగా జాతకంలో గల కాలసర్ప దోష నివారణా, నాగశాంతి మహాయజ్ఞము నిర్వహించారు.

**14వ తేదీన నాగదేవతా మహాయజ్ఞం**

ఈ నెల 14వ తేదీన పీఠంలో నాగ దేవతా మహాయజ్ఞం నిర్వహిస్తారని మహర్షి యద్దనపూడి అయ్యన్నపంతులు తెలిపారు.

# దడ పుట్టిస్తున్న ఉల్లి ధర



దర్శి : దళారులు, వ్యాపారులు తలుచుకుంటే తిమ్మిని బమ్మిని చేయగలరు. కొరత సృష్టించడం.. డిమాండ్ పెరిగిందని ప్రచారం చేయడం.. ధర అమాంతం పెంచడం.. అవలీలగా చేసేయగలరు. ఉల్లిగడ్డల విషయంలోనూ అదే జరిగింది. రాష్ట్రంలో పంట ఉత్పత్తి తగ్గుముఖం పట్టడంతోనే ఒక్కసారిగా ధర పెరిగిపోయింది. చిల్లర మార్కెట్లో కిలో రూ. 60 అమ్ముతున్నాయి. ఈ నెల 4న కిలో ధర రూ. 20 ఉంది. కర్నూలు ప్రాంతం నుంచి ఉత్పత్తి తగ్గింది. అక్కడ రోజుకు 60 లారీల (20 టన్నులు) సరుకు వస్తుంది. ఈ నెల రెండో వారం ఆరంభం నుంచే పంట కోతలు తగ్గిపోవడంతో రోజుకు పది లారీలకు ఉత్పత్తి పడిపోయింది. దీంతో మార్కెట్లో ధర రోజురోజుకు పెరుగుతూ వచ్చింది. టోకు ధర కిలో రూ. 55 దాకా పెరిగింది. ప్రభుత్వం ఎగుమతులు నిలిపివేయడంతో ధర పెరుగుదల ఆగి.. షోలాపూర్ రకం కిలో రూ. 46లకు వచ్చింది. చిల్లర మార్కెట్లో మాత్రం ధర తగ్గలేదు. జిల్లాలో రోజుకు సగటున 900 క్వింటాళ్ల వరకు ఉల్లిగడ్డల వినియోగం ఉంది. ఒక్క దర్శి మార్కెట్‌లోనే నిత్యం 200 క్వింటాళ్లు అమ్ముడుపోతాయి. ధర పెరగడంతో 20 రోజుల నుంచి వినియోగం తగ్గింది, 30 శాతం మేర కొనుగోళ్లు తగ్గిపోయాయి. రాష్ట్రంలో కర్నూలు ప్రాంతంలో ఉల్లి పంట ఎక్కువగా పండుతుంది. సాధారణంగా ఆగస్టు నుంచి డిసెంబరు వరకు అక్కడ పంట వస్తుంది. జిల్లాలోని యర్రగొండపాలెం, పరిసర ప్రాంతాల్లోనూ నవంబరు, డిసెంబరు నెలల్లో పంట ఉత్పత్తి ఉంటుంది. ఈ ఏడాది వర్షాభావం కారణంగా ఈ రెండు ప్రాంతాల్లోనూ పంట ఉత్పత్తి భారీగా తగ్గిపోయింది. గత ఏడాదితో పోలిస్తే 20 శాతం ఉత్పత్తి కూడా ప్రస్తుతం రావడంలేదు. దీనికి తోడు మన ప్రాంత రైతులు ఉల్లి నాటే విధానాన్ని అనుసరిస్తారు. దీనివల్ల దిగుబడి తగ్గుతుంది, ఉల్లిగడ్డలోనూ నీటి శాతం ఎక్కువ ఉంటుంది. ఉత్తర భారతదేశంలోని రైతులు విత్తనాలు చల్లుతారు. దీనివల్ల దిగుబడి పెరుగుతుంది. ఎకరాకు సగటున 60 క్వింటాళ్లకు తక్కువ కాకుండా వస్తుంది. నీటి శాతం గడ్డలో తక్కువ ఉండడం వల్ల నిల్వ ఎక్కువ కాలం ఉంటుంది. మహారాష్ట్రలోని షోలాపూర్, అంజన్‌గామా, చిత్రగామా తదితర ప్రాంతాల రైతులు మొదటి రెండు కోతలను అమ్ముకొని, మూడో కోత నిల్వ ఉంచుకుంటారు. ధర పెరిగిన సమయంలో అమ్ముకుంటారు. ప్రస్తుతం జిల్లాకు షోలాపూర్ ప్రాంతం నుంచే సరుకు దిగుమతి అవుతుంది. దేశవ్యాప్తంగా అవసరాలకు సరిపడా సరఫరా లేకపోవడంతో ధర నియంత్రణ లేకుండా పోయింది. ఆసియాలోనే అతిపెద్ద మార్కెట్ అయిన అజాద్‌పూర్ మండీ మార్కెట్లో టోకు ధర రూ. 45 నుంచి రూ. 50 మధ్య ఉంది.

దేశంలో అత్యధికంగా మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో పంట ఉత్పత్తి ఉంటుంది. ఈ ఏడాది కరా?టక, మధ్యప్రదేశ్‌ల్లో ఉత్పత్తి తగ్గడం కూడా ధర పెరుగుదలకు కారణమైంది.

కాపులను బీసీల్లో చేర్చడంపై

# నిరసన తెలిపిన బీసీ నాయకులు



విశాఖపట్నం: రాష్ట్రముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు కాపులను బిసి జాబితాలోకి చేర్చి వారికి 5శాతం రిజర్వేషన్ కల్పించడంపై జిల్లా బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు బుగత నర్సింగరావు నిరసనను తెలిపారు. బిసి సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పుడు ఉన్న బిసిలకే రిజర్వేషన్ లలో న్యాయం చేయలేకపోతున్న చంద్రబాబు అదనంగా బీసీలోకి కాపులను చేర్చి బీసీలకు మరింత అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

కాపులను బీసీల్లో చేర్చడంపై నేడు సోమవారం మద్దిలపాలెం తెలుగుతల్లి విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు బుగత నర్సింగరావు తెలిపారు.

ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బుగత నర్సింగరావుతో పాటు బిసి నాయకులు రాము నాయుడు, గొలగాని కృష్ణ, కామన సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## డిసిఐ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం

# వెంటనే ఉపసంహరించుకోవాలి

విశాఖపట్నం : డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(డిసిఐ)లోని మొత్తం వాటాలను ప్రయివేటు వ్యక్తులకు అమ్మాలని కేంద్ర క్యాబినెట్ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ, డిసిఐ ఉద్యోగుల పోరాటానికి మద్దతుగా సిఐటియు ఆధ్వర్యంలో సరస్వతీ పార్కు నుండి సీహార్స్ జంక్షన్ వరకు ర్యాలీ జరిగింది. అనంతరం సీహార్స్ జంక్షన్ (పోర్టు ప్రవేవ ద్వారం) వద్ద సిఐటియు నగర అధ్యక్షులు ఆర్.కె.ఎస్.వి.కుమార్ అధ్యక్షతన సభ జరిగింది.

ఈ కార్యక్రమానికి సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నరసింగరావు ముఖ్యవక్తగా పాల్గొని ప్రసంగించారు. డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డిసిఐ) విశాఖ కేంద్రంగా 1976లో ఏర్పడినప్పటి నుండి లాభాలతో నడుస్తున్నది. సేతు సముద్రం ప్రాజెక్టు పనులకు 167కోట్లు కేంద్ర ప్రభుత్వం బకాయి పడింది. ఇంకో 273కోట్లు వివిధ మేజర్‌పోర్టులు బకాయిలు డిసిఐకి చెల్లించాల్సి వుంది. దేశంలోనే మేజర్ పోర్టులు మరియు ఇండియన్ నేవికి అవసరమైన డ్రెడ్జింగ్ పనులు చేస్తూ డిసిఐ కీలకపాత్ర పోషిస్తున్నది.

ప్రపంచంలోనే మొదటి 10డ్రెడ్జింగ్ సంస్థలలో డిసిఐ ఒకటిగా ఎదిగింది. దేశంలోనే కాకుండా పోటీపడి అంతర్జాతీయంగా కూడా టెండర్లు ద్వారా వర్కు ఆర్డర్లు సంపాదిస్తున్నది. ఈమధ్యనే బంగ్లాదేశ్ ముంగ్ల పోర్టు వర్కుఆర్డర్లు సంపాదించింది. ప్రస్తుతం 1855.35కోట్ల రూపాయలు విలువైన వర్కు ఆర్డర్లు డిసిఐ చేతిలో ఉన్నాయి. గత 10 సంవత్సరాల కాలంలో డివిడెండ్లు, పన్నుల రూపంలో 213కోట్ల రూపాయిలు కేంద్ర ప్రభుత్వానికి చెల్లించింది. 28 కోట్లు రూపాయల మూల ధనంతో ప్రారంభించిన డిసిఐ యొక్క ఆస్తులు ఈరోజు సమారు 5వేల కోట్ల రూపాయలు పైబడే ఉన్నాయి. నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు పోరాటాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ కోసం

# ప్రతి డివిజన్‌కు ఒక నోడల్ అధికారి

ఒంగోలు : స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమం అమలులో భాగంగా నగరంలోని ప్రతి డివిజన్‌కు ఒక నోడల్ అధికారిని నియమించనున్నట్లు కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన బాపూజీ వాణిజ్య సముదాయం, అద్దంకి బస్టాండ్, సత్యనారాయణపురం, 60 అడుగుల రోడ్డు, గుంటూరు రోడ్డులో పర్యటించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసు కున్నారు. పారిశుద్ధ్యం, కాలువల శుభ్రత, ఇతర్రతా ఏ సమస్యలు ఉన్నా పురసేవా యాప్ ద్వారా తెలిపితే 24 గంటల్లో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రతి డివిజన్‌కు ఒక నోడల్ అధికారిని నియమించామని, వారు ప్రతి రోజూ ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకూ ఆయా ప్రాంతాల్లో పర్యటించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్నారు. డీఈ, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు, కార్పొరేషన్ మేనేజర్లను బృంద నాయకులుగా నియమిస్తూ మూడు బృందాలను నియమించా మన్నారు.

వీరు ప్రతి రోజూ సాయంత్రం కాలనీల్లో ప్రజలతో సమావేశాలు నిర్వహించి పారిశుద్ధ్యం మెరుగుదలకు సూచనలు చేస్తారన్నారు. కాలనీల్లో పర్యటించినట్లు పురసేవ యాప్‌లో పొటోలు పెడితేనే.. వారికి హాజరు వేస్తామన్నారు. పర్యటనలో పట్టణ ప్రణాళిక విభాగం ఏసీపీ వెంకటేశ్వర్లు, డీఈ భాస్కర్, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు మోహనరావు, ఏఈ సునీల్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ బాబ్జీ ఉన్నారు.

# టెక్నికల్ కోర్సు పరీక్షలకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు : చేనేత, కుట్టు, ఎంబ్రాయిడరీ, డ్రాయింగ్‌కు సంబంధించి లోయర్, హయ్యర్ గ్రేడ్ టెక్నికల్ సర్టిఫికెట్ పరీక్షలు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరుగుతాయని డీఈవో విజయ భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏడో తరగతి ఉత్తీర్ణులైన ప్రతి ఒక్కరూ లోయర్ గ్రేడ్ పరీక్షలకు హాజరు కావచ్చన్నారు. గతంలో లోయర్ గ్రేడ్ ఉత్తీర్ణులైన వారు హయ్యర్‌గ్రేడ్ పరీక్షలకు హాజరు కావచ్చని వివరించారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో ఈ నెల 28లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఇతర వివరాలకు వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. డ్రాయింగ్ లోయర్ గ్రేడ్‌కు రూ.100, హయ్యర్ గ్రేడ్‌కు రూ.150. చేనేత లోయర్ గ్రేడ్‌కు రూ.150, హయ్యర్‌గ్రేడ్‌కు రూ.200. కుట్టు, ఎంబ్రాయిడరీ లోయర్ గ్రేడ్‌కు రూ.150, హయ్యర్‌గ్రేడ్‌కు రూ.200 పరీక్ష రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు.

# శుభగృహ వారి 'సుకృతి అనంతిక' భూమిపూజ ప్రారంభం



విశాఖపట్నం: ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ శుభగృహ వారు పెందుర్తి నుండి 3కి.మీ దగ్గరలో అత్యంత అధునాతన సదుపాయాలతో రూపొందుతున్న నూతన హౌసింగ్ ప్రాజెక్టు 'సుకృతి అనంతిక' వెంచర్‌కు సంస్థ ఛైర్మన్ ఎన్.శంకరరావు భూమిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భూమి పూజ కార్యక్రమంలో సంస్థ వైస్ ఛైర్మన్ ఎన్.కల్యాణ్ చక్రవర్తి మరియు కస్టమర్లు, పుర ప్రముఖులు, మార్కెటింగ్ సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సంస్థ ఛైర్మన్ ఎన్.శంకరరావు మాట్లాడుతూ పెందుర్తి-ఆనందపురం 6లైన్ల జాతీయ రహదారికి ఆనుకుని వుడా ఎల్పి నెంబర్లతో అత్యంత అధునాతన సదుపాయాలతో వెంటనే గృహ నిర్మాణం చేపట్టుటకు వీలుగా సుకృతి అనంతిక హౌసింగ్ వెంచర్‌ను అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, కార్పొరేట్ సంస్థ ఉద్యోగులు, వ్యాపార వర్గాల వారికి, మధ్యతరగతి వారికి కూడా అనువైన పద్ధతిలో ఈ సుకృతి అనంతిక హౌసింగ్ వెంచర్ రూపొందుతుందని అన్నారు. అనతికాలంలోనే కస్టమర్లు అనేక రెట్లు ఆదాయం పొందే సౌకర్యం సమకూరుతుందని అన్నారు. బుకింగ్స్‌ని కూడా నేడు ప్రారంభించడం జరిగిందని అత్యంత ఆదరణ లభించడం సంతోషదాయకమని ఆయన అన్నారు. సంస్థ వైస్ ఛైర్మన్ యన్.కల్యాణ చక్రవర్తి మాట్లాడుతూ ఇప్పటివరకు శుభగృహ అనేక హౌసింగ్ వెంచర్లను హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలలో విజయవంతంగా పూర్తి చేసిందని అన్నారు. సభ్యులు పెట్టే పెట్టుబడికి ఊహించనంత లాభదాయకంగా ఈ సుకృతి అనంతిక వెంచర్ వుంటుందని ఆయన అన్నారు. తమకు లాభాలే ప్రధాన ధ్యేయం కాదని, కస్టమర్ల సంతృప్తి కూడా ముఖ్యమని అందువలన 100శాతం వాస్తు, 10,000 చ॥అ॥ల లావిష్ క్లబ్‌హౌస్, ఓవర్ హెడ్ ట్యాంక్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టమ్, విద్యుత్తు సదుపాయం, పార్కు స్విమ్మింగ్‌పూల్, వెంచర్ చుట్టూ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లను కల్పిస్తున్నామని అన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో విశాఖ, విజయనగరంనకు చెందిన అనేకమంది ప్రముఖులు, వ్యాపారవేత్తలు, కస్టమర్లు, మార్కెటింగ్ సిబ్బంది తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



2018 డైరీలు, క్యాలెండర్లు హోల్‌సేల్
భారతీయ స్టేషనరీ & బుక్ సెంటర్
పూర్ణామార్కెట్ కార్ పార్కింగ్ ఎదురుగా
విశాఖపట్నం 530001
98499 92338, 2561749, 2781865

# పోషకాల రేడు నేరేడు



ప్రస్తుతం మార్కెట్లో ఎక్కడ చూసినా కరర్ ఫుల్‌గా నేరేడు పండ్లతో కళకళ లాడుతున్నది. వర్షాకాలం మొదలైతే చాలు..నేరుడు పండ్ల సీజన్ ప్రారంభ మవుతుంది. ప్రతి సీజన్‌లోనూ ఆ సీజన్‌కు మాత్రమే పరిమితమైన కొనని పండ్లు, పువ్వులు లభిస్తుంటాయి. అలా వర్షా కాలంలో నేచర్ మనుకు గిఫ్ట్‌గా ఇచ్చిన అమేజింగ్ అండ్ హెల్తీ ఫ్రూట్స్‌లో నేరేడుపండు ఒకటి. చూడటానికి నల్లగా, నిగనిగలాడుతూ ద్రాక్ష పండ్లలా నోరూరిస్తుండే నేరుడు పండ్లు ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. నేరేడు పండ్లు పిల్లలకు మాత్రమే కాదు, పెద్దలందరికీ కూడా చాలా అరోగ్యకరం. నేరేడు పండ్లలో పోషకాలు మెండుగా ఉంటాయి. కేవలం పండే కాదు, నేరేడు చెట్టు ఆకులు, గింజలు, బెరడు..ఇలా అన్నీ ఆరోగ్యానికి మేలు చేసేవే. నేరేడు మధుమేహం, క్యాన్సర్ వంటి వివిధ ఆరోగ్య సమస్యలకు పరిష్కారం చూపుతుంది. ఇంతటి ప్రత్యేకత ఉన్న నేరేడులో ఉండే ఇతర పోషక విలువలేమిటో ? అవి ఆరోగ్యానికి ఏవిధంగా మేలు చేస్తాయో తెలుసుకుందాం...

**ఆరోగ్యానికి సరిజోడు:** నేరేడు ప్రయోజనాల గురించి తెలుసుకునే ముందు బాగా పండిన నేరేడు పండులో గ్లూకోజ్, ఫ్రక్టోజ్ పుష్కలంగా లభిస్తాయి. ఇతర పండ్లతో పోల్చి చూస్తే మినరల్స్ అధికంగా, క్యాలరీలు తక్కువగా ఉంటాయి. కాబట్టి, దీన్ని తినడం వల్ల బరువు పెరుగుతామన్న దిగులు కూడా ఉండదు. నేరేడు గింజల నుండి కూడా అధిక సంఖ్యలో ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్లు, కొద్ది మొత్తంలో క్యాల్షియం, విటమిన్ బి, సి, ఐరన్ లు కూడా లభిస్తాయి. ప్రతి వంద గ్రాముల నేరేడు పండ్లలో రెండు మిల్లీగ్రాముల ఐరన్ ఉంటుంది. శరీరానికి రోజుకి కావల్సిన విటమిన్ సి నలభై% మిల్లీగ్రాములె%తే.. వందగ్రాముల నేరేడులో 18 మిల్లీగ్రాముల దాకా ఉంటుంది. కెరోటిన్, ఫైటోకెమికల్స్ (యాంటీఆక్సిడెంట్లు), మెగ్నీషియం, పొటాసియం, పీచుపదార్థాలు, మొద లైన పోషకాలన్నీ కూడా నేరేడు నుంచి మనకు లభిస్తాయి.

**ఆకుల్లోనూ యాంటీ బ్యాక్టీరియా:**

అలాగే నేరేడు చెట్టుకు ఆకుల్లో ఉండే యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు దంతాలను స్ట్రాంగ్ గా ఉంచడంతో పాటు చిగుళ్ల సమస్యలను తగ్గించ డంలో కీలక పాత్ర పోషిస్తాయి. లివర్ సమస్యలను మెరుగు పరుస్తుంది: నేరేడు పండులో ఉండే గుణాలు కాలేయం యొక్క పనితీరును మెరుగుపరుస్తుంది. ఈ పండులో ఉండే నేచురల్ ఆమ్లాలు జీర్ణశక్తిని పెంచడంలో గ్రేట్‌గా సహాయ పడుతాయి. **కోరింత దగ్గు నివారిస్తుంది:** వర్షాకాలంలో జలుబు, దగ్గు..వంటి ఆరోగ్య సమస్యలు రావడం సహజం. నేరేడు కూడా వర్షాకాలంలో లభించే పండు కాబట్టి, వీటిని తినడం వల్ల జలుబు, కోరింత దగ్గు, దీర్ఘకాలంగా వేధించే దగ్గు, ఆస్తమా..లాంటి సమస్యలను నుంచి విముక్తి పొందవచ్చు. అంతేకాదు పైల్స్ నివారణకూ తోడ్పడుతుంది. ఈ సీజన్‌లో నేరేడు పండును రోజూ ఉదయం ఉప్పుతో పాటు తీసుకోవడం ఆరోగ్యానికి చాలా మంచిది. పైల్స్ సమస్యతో బాధపడుతున్న వారు నేరేడు పండును తేనెతో పాటు తీసుకుంటే మంచిది.

**ఇమ్యూనిటి పెంచుతుంది:** వర్షాకాలంలో వచ్చే వివిధ జబ్బుల నుండి శరీర ఆరోగ్యాన్ని కాపాడుకొనే శక్తిని నేరేడు అందిస్తుంది. క్యాన్సర్ నివారిణినిగానూ పనిచేస్తుంది. నేరేడులో ఉండే బయోయాక్టివ్ ఫోటో కెమికల్స్, పాలిఫినోల్స్ క్యాన్సర్ రాకుండా నివారిస్తాయి. కీమోథెరఫీ వంటి క్యాన్సర్ చికిత్సలు చేయించుకునే సమయంలో నేరేడు పండ్లను ఆహారంగా తీసుకోవటం వల్ల చక్కటి ప్రయోజనం ఉంటుంది. క్యాన్సర్ రాకుండా రక్షస్తుంది.

**డయాబెటిస్ కంట్రోల్ చేస్తుంది:** డయాబెటిస్‌ను అదుపులో ఉంచడానికి ఆయుర్వేద మందుల్లో నేరేడు పండు గింజల్ని వాడతారు. అంతేకాదు డయోరియాతో బాధపడేవారికి నేరేడు చక్కటి పరిష్కార మార్గం.

నేరేడు పండ్ల గింజలను పొడిగా చేసుకునిమజ్జిగలో కలుపుకుని తాగితే సమస్య నుంచి బయటపడొచ్చు. నేరేడు చెట్టు బెరడును మెత్తగా నూరి కాషాయంలా తయారుచేసుకుని దానిలో తేనె కలుపుకుని తీసుకున్నా డయేరియా నుంచి త్వరగా ఉపశమనం పొందవచ్చు.

# చెవి కాస్త పదిలం

చెప్పులోని రాయి... చెవిలోని జోరిగ పెట్టే ఇబ్బంది అంతా ఇంతా కాదని అంటుంటారు కానీ కొన్ని సార్లు ఏ జోరీగా లేకపోయినా ఏదో తిరుగుతున్నట్టుగా మెదడులో రొద భరించతరం కాదు. ఒక్కోసారి చెవిలో దురదతో ఏమీ తోచదు. మరే పనిమీద మనసు కుదరదు. ఇలాంటి సమస్యలు చిన్నవే కానీ.... కానీ ఇవి కలిగించే ఇబ్బంది అది ఎదుర్కొంటున్న వారికే అర్థమవుతుంది. దీపావళి పండగ వెలుగుల పండగ మాత్రమే కాదు టపాసుల పండగ కూడా. టపాసుల శబ్ధాలు కూడా ఉంటాయి. వీటి వల్ల కూడా చెవికి నష్టం జరగవచ్చు. దీని గురించిన కొద్ది పాటి అవగాహన.....

చెవిలో దురద వల్ల మరే పని తోచదు. ఇలా చాలా ఇబ్బంది పెట్టే చెవిలో దురదకు కారణం చాలాసార్లు చెవిలోని చర్మం పొడిబారడమయి ఉంటుంది. కొన్ని సార్లు ఇన్‌ఫెక్షన్ వల్ల కూడా కావచ్చు. అది ఫంగల్ ఇన్‌ఫెక్షన్ అయితే దురదతో పాటు చెవి నుంచి స్రావాలు కూడా వస్తుంటాయి.

-ఆటైటిస్ మీడియా - అంటే మధ్య చెవిలో నీరు చేరడం. ఇలా మధ్య చెవిలో నీరు చేరడం వల్ల చెవిలో దురదగా ఉంటుంది.

-సొరియాసిస్ వల్ల కూడా చెవిలో దురద రావచ్చు. ఒక్కోసారి సొరియాసిస్ చెవిలోపలే ప్రారంభం కావచ్చు.

-చెవిలో చుండ్రు చేరడం వల్ల కూడా చెవిలో దురద వచ్చే అవకాశాలున్నాయి. ఎందుకంటే చెవిలోపలి చర్మం, తల పై ఉండే చర్మం ఒకే విధమైనవి. చాలా సందర్భాల్లో తలలో కూడా చుండ్రు ఉన్నపుడే చెవిలోనూ చుండ్రు చేరుతుంది కానీ కొన్ని సార్లు కేవలం చెవిలో మాత్రమే కూడా చుండ్రు ఉండవచ్చు.

-చెవిలో వ్యాక్స్ ఎక్కువగా పోగుపడిపోవడం కూడా దురదకు కారణం అవుతుంది.

-సాధారణంగా దురద దానంతటదే తగ్గిపోవాలి. అలా తగ్గడం లేదంటే తప్పనిసరిగా డాక్టర్‌ని కలిసి చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది. పొడి చర్మం వల్ల దురదగా ఉన్న వారికి చర్మంలో తేమ నిలిపి ఉంచేందుకు క్రీములు, చెవిలో తడి ఎక్కువగా ఉండడం వల్ల లేదా ఇన్‌ఫెక్షన్ వల్ల దురద వచ్చేట్టయితే డ్రాప్స్ వంటి మందులు అందుబాటులో ఉన్నాయి. వీటిని డాక్టర్ సలహాతో వాడడం వల్ల దురద నుంచి విముక్తి పొందవచ్చు. లేదా మరే ఇతర కారణంతోనైనా దురద వస్తుంటే దానికి చికిత్స తీసుకోవడం ద్వారా చెవిలో దురద తగ్గిపోతుంది.

**శబ్దాలు**

కొంత మందికి చెవిలో నిరంతరంగా ఏదో ఒక శబ్దం వినిపిస్తున్నట్టుగా ఉంటుంది. ప్రశాంతంగా ఉన్న సమయాల్లో, నిద్రలో ఈ శబ్దాలు ఎక్కువగా ఉన్నట్టుగా అనిపిస్తుంది. వీటి వల్ల జీవితంలో ప్రాశాంతత లోపించిన భావన కలుగుతుంది. అయితే ఇలా చెవిలో శబ్ధాలు రావడానికి చాలా కారణాలుంటాయి. మెదడులో శ్రవణ నాడికి పైన చెవికి శ్రవణ నాడికి మధ్య భాగంలో ఉండే కాక్లియాలో ఉండే ఎయిర్ సెల్స్‌లో వచ్చే తేడాల వల్ల ఇలా చెవిలో రణగొణ ధ్వనులు రావచ్చు.

ఇలా చెవిలో శబ్ధం రావడాన్ని టినిటస్ అంటారు. మన మెదడు ఒకసారి ఒకే శబ్ధాన్ని స్పష్టంగా గ్రహించగలుగుతుంది. మరేదైనా ఇతర శబ్దాల మీదకు దృష్టిని మళ్లించడం ద్వారా వీటి నుంచి విముక్తి పొందవచ్చు.

ఇలా శబ్ధాలతో పాటుగా కళ్లు తిరగడం, తలనొప్పి, వినికిడి తగ్గడం, వాంతుల వంటి లక్షణాలుంటే మాత్రం వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. ఇలాంటి సందర్భాలు మరేదైనా ప్రమాదరకరమైన స్థితి లక్షణం కావచ్చు. కాబట్టి ఎందుకు ఇలాంటి శబ్ధాలు వస్తున్నాయనే విషయాన్ని తప్పనిసరిగా నిర్ధారించు కోవాల్సి ఉంటుంది.

**నొప్పి**

చెవిలో నొప్పి భరించతరం కానీ విధంగా ఉంటుంది. చెవిలో నొప్పి రావడానికి చాలా కారణాలున్నాయి.

-చెవిలో ఇన్‌ఫెక్షన్ రావడం -చెవిలో ట్యూమర్లు ఏర్పడడం

-దవడ కీలులో ఏదైనా చిన్న సమస్య వచ్చినా కూడా చెవిలో నొప్పి రావచ్చు


# తిన్న వెంటనే నీళ్లు తాగకూడదా?



మంచినీళ్లు ఎంత ఎక్కువ తాగితే అంత మంచిదని అందరూ అనుకుంటారు. ఆ మాటా నిజమే అయినా ఆహారం తీసుకున్న వెంటనే నీళ్లు తాగడం మాత్రం మంచిది కాదట. ఆహారం తిన్న వెంటనే నీటిని తాగడం మాత్రం జీర్ణప్రక్రియను ఆలస్యం చేస్తుందట. పొట్టలోని ఆమ్లాలను డైల్యూట్ చేసి జీర్ణప్రక్రియకు ఆటంకం కల్పిస్తుందట. అలాగే తీసుకున్న ఆహారంలోని విటమిన్లను, లవణాలను శరీరం శోషించుకోకుండా అడ్డుపడుతుందట. అందుకే భోజనం చేసిన అరగంట తర్వాతే మంచినీరు తీసుకోవాలట. తప్పదనిపిస్తే చాలా తక్కువ మొత్తంలోనే తాగాలట.




# చైనాలో కనిపిస్తున్న వెరైటీ వైద్యం!




గ్జియాన్: ఆరోగ్యంకోసం ప్రకృతి వైద్యాన్ని ఆశ్రయించడం ఆధునిక కాలంలోనూ చూస్తూనే ఉన్నాం. చెట్ల బెరళ్ళు, మూలికలు, కషాయాలను వాడి వ్యాధులు తగ్గించుకునే పాత పద్ధతులు పెద్దగా కనిపించకపోయినా... ఆయుర్వేదం, హోమియో, అలోపతితోపాటు.. అనేక ప్రకృతి వైద్యాలను ఆశ్రయిస్తున్నవారు లేకపోలేదు. సాంకేతికంగా అత్యంత అభివృద్ధి చెందిన చైనా దేశం కూడా అటువంటి వైద్యాలను ఆశ్రయించడంలో ముందే ఉంది. ఇప్పుడక్కడ కనిపిస్తున్న దృశ్యాలే అందుకు పెద్ద నిదర్శనం. ఎండలో కాలే కాలే రాళ్ళపై పడుకుంటే ఎన్నో రకాల రోగాలు నయమౌతాయంటున్నారు అక్కడి మహిళలు.


చైనా నగరం గ్జియాన్ కు చెందిన మహిళలు ఇప్పుడు ప్రకృతి వైద్యం బాట పట్టారు. తీక్షణమైన ఎండలో.. కాలే కాలే రాళ్ళపై పడుకొనే వెరైటీ వైద్యం చేసుకుంటున్నారు. అంతేకాదు అదో కొత్త హెల్గ్ ట్రెండ్ గా చెప్తున్నారు. ముఖాలపై చిన్నపాటి టవల్ నో, గుడ్డనో కప్పుకొని, ఎండలో ఉన్న అతిపెద్ద రాళ్ళను కౌగలించుకునో, వెల్లకిలానో పడుకొన్న మహిళలు కనిపించడం గ్జియాన్ ప్రాంతంలో ఇప్పుడు మామూలైపోయింది. వారికోసం పార్కుల్లోనూ, ఎండ తగిలే ఖాళీ ప్రదేశాల్లోనూ ప్రత్యేకంగా పెద్ద పెద్ద రాళ్ళను ఏర్పాటు చేస్తున్నారు. మొదట్లో అలా రాళ్ళపై పడుకున్న మహిళలను చూసి, అంతా అదో వ్యాయామం అనుకున్నారు. కానీ స్థానిక రిపోర్టర్లు వారిని కలిసిన తర్వాతే అసలు విషయం తెలిసింది. అదో ప్రాచీన వైద్య పద్ధతి అని, ముఖ్యంగా మహిళల్లో అనేక రోగాలను నయం చేస్తుందని చెప్పారు. సైనోవిటిస్, కండరాలు గట్టిపడటం వంటి వ్యాధులు వచ్చిన తన బంధువు ఒకరు ఇలా రాళ్ళ వైద్యాన్ని పాటించారని, కొన్నాళ్ళకు ఆమెకు పూర్తిగా నయం అయిపోవడంతో తాను కూడ ఈ వైద్యాన్ని అనుసరిస్తున్నట్లు 'లో' అనే మహిళ చెప్పింది. సుమారు సాయంత్రం 3, 4 గంటల మధ్య ప్రాంతంలో ఇలా రాళ్ళపై పడుకుంటే ఎంతో ఉపయోగం అని తెలిపింది. అలాగే లైంగిక శక్తి లోపించిన వారికి సైతం ఈ వైద్యం అత్యంత ఉపయోగంగా ఉంటుం దని చెప్తున్నారు.

అయితే గ్జియాన్ లో కనిపిస్తున్న వేడి రాళ్ళ వైద్యాన్ని డాక్టర్లు ఎంతమాత్రం సమర్థించడం లేదు. పైగా ఈ ప్రయత్నం అనేక ప్రమాదాలకు దారి తీసే అవకాశం ఉంటుందంటున్నారు. అధిక ఉష్ణోగ్రత శరీరానికి తగలడంవల్ల ప్రమాదాలు తలెత్తుతాయంటున్నారు. చర్మం బొబ్బలెక్కడం నుంచీ వడదెబ్బ తగలడం వరకూ ఏదైనా ప్రమాదమేనంటున్నారు. వైద్యులు వారించిన అనంతరం ఓ 70 ఏళ్ళ మహిళ తనకు అటువంటి అనుభవమే అయినట్టు స్థానిక మీడియాకు తెలిపింది.

అలా రాళ్ళపై పడుకున్న తర్వాత, కాలిన వేడికి కడుపులో తీవ్రమైన నొప్పి ప్రారంభమైనట్లు చెప్పింది. అయితే చాలాశాతం మంది మీడియా చెప్పిన మాటలనూ వినడం లేదు. ఇప్పటికీ గ్జియాన్ నగరంలో రాళ్ళపై మహిళలు కనిపిస్తూనే ఉన్నారు. రాళ్ళపై పడుకోవడం ఒక్కటే కాదు.. అనేక వైద్యాలకు రాళ్ళను వినియోగించడం ఇటీవలి కాలంలో తరచుగా చూస్తున్నాం. ఓ వ్యక్తి తన ఒంట్లో అధికంగా ఉన్న 30 కేజీల బరువును తగ్గించుకునేందుకు తలపై 40 కేజీల బరువు రాయిని పెట్టుకొని వాకింగ్ చేసినట్లు వార్తలు వచ్చాయి. జిహ్వాకో రుచి, పుర్రెకో బుద్ధి అనుకొని ఊరుకోవడం తప్పించి వినని మనుషులకు ఎవరు మాత్రం ఏం చెప్తారు?



# హైబీపీ తగ్గించే కిస్‌మిస్



ఎండుద్రాక్షలో విటమిన్లు పుష్కలంగా ఉన్నాయి. యాంటీయాక్సిడెంట్లు, పీచు వంటివి రక్తహీనతను దరిచే రనివ్వవు. ఎండుద్రాక్షలకు జీర్ణక్రియను మెరుగుపరిచే శక్తి ఉంది. వీటిని క్రమం తప్పకుండా రోజుకు ఆరు లేదా ఐదింటిని తీసుకుంటే.. చిన్న పేగులోని వ్యర్థ పదార్థాలను సులభంగా వెలివేసినవారమవుతాం. ఎండుద్రాక్షల్లోని పీచు కడుపులోని నీటిని పీల్చేస్తుంది. తద్వారా విరేచనాలు వంటి ఉదర సంబంధిత రుగ్మతలను దూరం చేస్తుంది. ఇవి రక్త హీనతకు మంచి మందుగా ఉపయోగపడతాయి. ముఖ్యంగా స్త్రీల కు ఇది ఎంతో ఉపయోగం. వీటిలో ప్రోటీన్లు, విటమిన్లు పుష్కలంగా ఉండటం ద్వారా బక్కపలచగా ఉన్నవారు తీసుకోవచ్చు. తద్వారా బరువు పెరుగుతారని న్యూట్రీషన్లు చెప్తున్నారు. క్రీడాకారులు తన శరీరానికి బలం చేకూర్చుకోవాలంటే.. ఎండుద్రాక్షల్ని తీసుకోవడం మంచిది. ఎండుద్రాక్షల్లోని ధాతువులు, కొలెస్టరాల్, విటమిన్లు, పీచు వంటివి శరీరానికి పోషకాలను అందిస్తాయి. వ్యాధినిరోధక శక్తిని పెంచుతాయి.

వీటిలోని యాంటీయాక్సిడెంట్లు క్యాన్సర్ కణాలను దూరం చేస్తాయి. హైబీపీని నివారిస్తాయి. గుండెను పదిలంగా ఉంచుతాయి. ఎండుద్రాక్షల్లో పొటాషియం రక్తనాళ్లాల్లో ఒత్తిడిని తగ్గించి ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇంకా వీటిలో విటమిన్ బి కాంప్లెక్స్, ఐరన్ ఉండటం ద్వారా రక్తకణాల ఉత్పత్తికి ఎంతగానో ఉపకరిస్తాయి.

ద్రాక్ష పండ్లను ఎండబెట్టినప్పుడు, ఎండు ద్రాక్ష తయారవుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తిఅయ్యే ద్రాక్షలో 80 శాతం పంటను వైన్ తయారీలో వాడుతారు. ఏడు శాతాన్ని ఎండు ద్రాక్షగా మలుస్తారు. మిగిలిన, శాతాన్ని మాత్రమే తాజాగా తినడానికి గాని జ్యూస్ తీసి వాడుకోవటానికి గాని వాడుతారు. మంచి పోషకాహర విలువలు కలిగి ఉం టాయి. కొన్ని రకాల వ్యాధులు సోకినప్పుడు ఇవి ఉత్తమ ఆహారంగా ఉపయోగ పడుతాయి

సంతానం లేని స్త్రీలు కిస్‌మిస్ పండ్లు తింటే అండా శయములోని లోపాలు తొలగి సంతానము కలుగుతుంది. మహిళలు ప్రతిరోజూ కిస్‌మిస్ పండ్లు తినుటవలన యూరినల్‌లో ఆమోనియా పెరగకుండా రాళ్ళు చేరకుండా కాపాడుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. కిస్‌మిస్ పండ్లను తరుచుగా తినడం వలన శరీరములో పులుపును స్వీకరించే శక్తిగల ఆమ్లాలను సమానం చేసి జ్వరము రానీయకుండా చేస్తుంది. 200 మిల్లిగ్రాముల పాలతో 50 గ్రాముల కిస్‌మిస్ పండ్లు తినడం వలన నరాల నిస్సత్తువ, రక్తపోటు దీర్ఘకాల వ్యాధులు నయమవుతాయి.

అలాగే రక్తం శుభ్రపడటానికి నరాలకు బలము చేకూరటానికి పది కిస్‌మిస్ పండ్లను నీళ్ళలోవేసి బాగా వుడకబెట్టి గుజ్జుగా వేసి తాగడం చేయాలని న్యూట్రీషన్లు సూచిస్తున్నారు. పిల్లలు రాత్రపూట పక్క తడుపుతుంటే వారికి వారంపాటు ప్రతిరోజూ రాత్రి రెండు ఎండు ద్రాక్ష పొలుకులను ఇవ్వండి. ఈ వారంలో వారికి చలవచేసే వస్తువులు, పెరుగు, మజ్జిగలాంటి పదార్థాలను ఇవ్వకండి. దీంతో పక్క తడిపే అలవాటునుంచి ఉపశమనం కలుగుతుంది. గొంతు వ్యాధితో బాధపడేవారు ఎండు ద్రాక్షను తీసుకుంటే ఉపశమనం కలుగుతుంది . ఎందుకంటే ఈ ఎండు ద్రాక్ష శరీరంలోని శ్వాసనాళికలో పేరుకుపోయిన కఫాన్ని తొలగిస్తుంది. దీంతో ఉపశనం కలుగుతుంది మలబద్దకంతో బాధపడేవారు ప్రతిరోజూ రాత్రపూట పడుకునేముందు ఎండుద్రాక్షతోబాటు సోంపును కలిపి తీసుకుంటే మలబద్ధకంనుంచి ఉపశమనం కలుగుతుంది. ఎండు ద్రాక్షను బాగా వేడి చేసిన నీళ్ళలో నానబెట్టి తర్వాత పిల్లలకు ఇస్తే వారిలో జీర్ణశక్తి బాగా వృద్ధి అవుతుంది.

# సుడిగాలిలా కోహ్లి నిన్ను దాటేశాడు



ఆగష్టులో అమాంతం పెరిగే గోదావరి నీటి మట్టంలా.. అమెరికాను ముంచెత్తే హరికేన్‌లా విరాట్ కోహ్లి క్రీజులో ఉన్న గంట గంటకూ రికార్డులు బద్దలు కొట్టేస్తున్నాడు. అతణ్ని ఎలా అవుట్ చేయాలో తెలియక లంకేయులు బుర్రలు బద్దలు కొట్టుకుంటున్నారు. 8 రోజుల వ్యవధిలోనే.. వరుసగా రెండో డబుల్ సెంచరీ బాదిన కోహ్లి అత్యధిక డబుల్ సెంచరీలు చేసిన కెప్టెన్‌గా లారా రికార్డును బ్రేక్ చేశాడు. టెస్టుల్లో తన అత్యధిక వ్యక్తిగత స్కోరును నమోదు చేశాడు. టెస్టుల్లో ఐదు వేల పూర్తి చేసిన రికార్డుతోపాటు.. వరుసగా మూడో టెస్టు సెంచరీ, అంతర్జాతీయ క్రికెట్లో 16 వేల పరుగులు, కెప్టెన్‌గా 3 వేల పరుగులు.. ఇలా ఎన్నో అరుదైన మైలు రాళ్లను కోహ్లి సొంత గడ్డ మీద చేరుకున్నాడు.

టెస్టుల్లో కోహ్లికి ఇది ఆరో డబుల్ సెంచరీ అనే సంగతి తెలిసిందే. తద్వారా భారత్ తరఫున అత్యధిక డబుల్ సెంచరీలు సాధించిన సచిన్, సెహ్వాగ్ సరసన విరాట్ నిలిచాడు. గత ఏడాది ప్రారంభం వరకూ ఒక్క ద్విశతకం కూడా కోహ్లి నమోదు చేయలేదు. కానీ 2016 జూలైలో వెస్టిండీస్ పర్యటన మొదలు.. లంకతో సొంత గడ్డ మీద సిరీస్ ముగిసే లోపు 499 రోజుల్లో విరాట్ 6 డబుల్ సెంచరీలు బాదేశాడు. ఇంత తక్కువ వ్యవధిలో ఇన్ని డబుల్ సెంచరీలు బాదిన ఏకైక క్రికెటర్ కోహ్లి మాత్రమే.

టెస్టు క్రికెట్లో ఎన్నో రికార్డులను నెలకొల్పిన ఆసీస్ దిగ్గజం డాన్ బ్రాడ్‌మ్యాన్ రికార్డును కూడా కోహ్లి బ్రేక్ చేశాడు. ఏడాదిన్నరలోపే కోహ్లి ఆరు డబుల్ సెంచరీలు బాదగా.. డాన్ బ్రాడ్‌మ్యాన్‌కు తొలి ఆరు ద్విశతకాలు సాధించడానికి 581 రోజులు పట్టింది. విండీస్ టూర్‌కు ముందు టెస్టుల్లో కోహ్లి సగటు 44 ఉండేది. ఈ ఆదివారం అది 54 దాటింది. సమకాలీన క్రికెట్లో స్మిత్ మాత్రమే టెస్టు యావరేజ్ విషయంలో కోహ్లి కంటే ముందున్నాడు. అన్నట్టూ మరో విషయం.. వినోద్ కాంబ్లి తర్వాత వరుసగా రెండు డబుల్ సెంచరీలు బాదిన భారత క్రికెటర్ కోహ్లి మాత్రమే.

## గాలి కాలుష్యం సాకుతో

# కంగుతిన్న లంక



శ్రీలంక ఆటగాళ్ల నాటకాలు అన్నీ ఇన్నీ కాదు. ఓ వైపు విరాట్ కోహ్లి డబుల్ సెంచరీతో మంచి ఊపుమీదున్నాడు.. మరోవైపు భారత్ స్కోరు 600కి చేరేలా ఉంది. వారి బౌలర్లు ఏ మాత్రం ప్రభావం చూపలేకపోతున్నారు. ఈ క్రమంలో లంక ఆటగాళ్లకి గాలి కాలుష్యం సాకు దొరికింది. గాల్లో నాణ్యత కరువైందని పదే పదే అంతరాయాలు కలిగించారు. ఆటగాళ్లతో పాటు జట్టు ఫిజియో, కోచ్ ఇలా అందరూ రంగంలోకి దిగి తొలుత మ్యాచ్‌ను 15 నిమిషాలు ఆపేశారు. ఆ తరవాత మళ్లీ అంతరాయాలు. ముఖానికి మాస్కులు వేసుకుని మరీ ఆడారు. ఈ నాటకీయ పరిణామాల మధ్య కోహ్లి, అశ్విన్ పెవిలియన్‌కు చేరారు. అయినా లంక ఆటగాళ్ల వేషాలు ఆగలేదు. దీంతో విసుగుపోయిన కోహ్లి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేశారు. పెవిలియన్ నుంచి క్రీజులో ఉన్న జడేజా, సాహాకు సైగ చేశాడు. వచ్చేయండి.. మనం బౌలింగ్ చేద్దాం అంటూ సంజ్ఞల ద్వారా తెలిపాడు. దీంతో లంక ఆటగాళ్ల తెగ సంబరపడిపోయారు. కానీ వారి ఆనందం ఎంతసేపో నిలవలేదు. శ్రీలంక తన తొలి ఇన్నింగ్స్ తొలి బంతికే మొదటి వికెట్‌ను కోల్పోయింది. మహమ్మద్ షమీ వేసిన అద్భుత బంతికి కరుణరత్నే ఔటయ్యాడు. కీపర్ సాహాకు క్యాచ్ ఇచ్చి ఖాతా తెరవకుండానే పెవిలియన్‌కు చేరాడు. ఆ తరవాత క్రీజులోకి వచ్చిన ధనంజయ డిసిల్వాను ఇషాంత్ శర్మ వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. 14 పరుగులకే లంక రెండు వికెట్లను కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ క్రమంలో క్రీజులోకి వచ్చిన ఏంజెలా మాథ్యూస్.. మరో ఓపెనర్ దిల్రువన్ పెరీరాకు చక్కని సహకారం అందించాడు. పెరీరా, మాథ్యూస్ కలసి మూడో వికెట్‌కు 61 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. అయితే ఈ జోడీని రవీంద్ర జడేజా విడగొట్టాడు. అర్ధ శతకానికి చేరువైన పెరీరాను ఎల్బీడబ్ల్యూగా జడేజా ఔట్ చేశాడు.

అక్కడి నుంచి మరో వికెట్ పడకుండా శ్రీలంక జాగ్రత్తగా ఆడుతోంది. దూకుడుగా ఆడుతున్న మాథ్యూస్ హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. ప్రస్తుతం తొలి ఇన్నింగ్స్‌లో 31 ఓవర్లు ముగిసే సరికి శ్రీలంక 3 వికెట్ల నష్టానికి 114 పరుగులు చేసింది. ఏంజెలా మాథ్యూస్ 52, దినేశ్ చండిమాల్ 13 పరుగులతో ఆడుతున్నారు.

# 2018లో చంద్రయాన్-2 రంగం సిద్ధం చేస్తున్న ఇస్రో

దిల్లీ: చంద్రయాన్-1 విజయవంతంగా ప్రయోగించిన ఇస్రో చంద్రుడిపై మరో చారిత్రక ప్రయోగానికి సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. చంద్రుడిపై పరిశోధనలు చేపట్టడానికి చంద్రయాన్-2 మిషన్‌ను సిద్ధం చేస్తోంది. అన్ని అనుకున్నట్లు జరిగితే 2018 మార్చి చివరి నాటికి దీన్ని ప్రయోగించాలని ప్రణాళికలు రచిస్తోంది.

చంద్రయాన్-2 ద్వారా ఇస్రో చంద్రుడిపై మూడు మానవ రహిత వాహనాలను పంపనుంది. ఆర్బిటార్ క్రాఫ్ట్, రోవర్, లాండర్‌ను పంపించనుంది. చంద్రుడి వాతావరణంలో తిరుగుతూ ఆర్బిటార్ క్రాఫ్ట్ పరిశోధనలు చేపట్టనుంది. ఇక లాండర్.. రోవర్‌ను చంద్రుని ఉపరితలంపై సురక్షితంగా దించనుంది. చంద్రుని ఉపరితలంపై రోవర్‌తో ఇలా పరిశోధనలు చేపట్టడం ఇస్రో చరిత్రలోనే ఇదే మొదటిసారి.

2008లో చంద్రయాన్-1ను ఇస్రో విజయవంతంగా శ్రీహరికోట నుంచి ప్రయోగించింది. ఇది చంద్రునిపై పరిశోధనలు చేపట్టి అక్కడ నీటి జాడకు సంబంధించిన సమాచారాన్ని అందించింది. అయితే, 2008 నవంబర్‌లో దీనిలో సాంకేతిక లోపం తలెత్తి చంద్రుని ఉపరితలంపై కూలిపోయింది. అప్పటికే దానికి అప్పగించిన పనిలో 80 శాతం పూర్తి చేసింది. దీన్ని 2016లో నాసా గుర్తించింది.

ఇప్పుడు చంద్రయాన్-2తో ఇస్రో మరోసారి చంద్రుడిపై పరిశోధనలు చేపట్టేందుకు సిద్ధమైంది. దాదాపు 93 మిలియన్ డాలర్ల ఖర్చు అయ్యే ఈ చంద్రయాన్-2 14 రోజుల్లో చేరుకోనుంది. ఆర్బిటార్ క్రాఫ్ట్ చంద్రుడికి సంబంధించి సవివర 3డీ



మ్యాప్‌ను రూపొందించనుంది. మరోవె%పు ఆరుచక్రాలను కలిగి ఉండే రోవర్ చంద్రుని ఉపరితలంపై తిరుగుతూ పరిశోధనలు చేపట్టనుంది. ఈ పరిశోధనలకు సంబంధించిన సమాచారాన్ని ఆర్బిటార్ క్రాఫ్ట్ ద్వారా భూమికి చేరవేయనుంది.

2013లో చంద్రునిపైకి చివరిసారిగా చె%నా తన మానవరహిత రోవర్ యుటూను పంపింది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ ఏ దేశం చంద్రునిపైకి రోవర్లు పంపలేదు.

## చారిత్రక చిత్రంలో సన్నీలియోనీ!

బాలీవుడ్ నటి సన్నీలియోనీ తొలిసారి తెలుగులో ప్రధాన పాత్రలో నటించనున్నారు. యుద్ధం నేపథ్యంలో ఓ చరిత్రాత్మక చిత్రంలో ఆమె నటించబోతున్నారు. ఈ సినిమాని తెలుగు, తమిళం, హిందీ, మలయాళం భాషల్లో ఏకకాలంలో నిర్మించనున్నారు. తమిళ దర్శకుడు వడి వుడయన్ దర్శకత్వం వహించనున్నారు. స్టీఫెన్ నిర్మాతగా వ్యవహరిస్తారు. కరెంట్ తీగ చిత్రంలో సన్నీ టీచర్ పాత్రలో కుర్రకారును ఉర్రూతలూగించింది.

# చరిత్ర పునరావృతం అవుతుందా?

## 2018 ఏప్రిల్ 27న రజనీ-శంకర్‌ల '2.ఓ'



రజనీకాంత్ కథానాయకుడిగా ప్రముఖ దర్శకుడు శంకర్ తెరకెక్కిస్తున్న సైన్స్ ఫిక్షన్ చిత్రం '2.ఓ'. అమీజాక్సన్ కథానాయిక. అక్షయ్‌కుమార్ ప్రతినాయక ఛాయలున్న పాత్రను పోషిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపుకొంటోంది. ముఖ్యంగా వీఎఫ్ఎక్స్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అన్నీ పూర్తయితే 2018 జనవరి 26న సినిమా విడుదల చేయాలని చిత్ర బ ృందం నిర?యించింది. అయితే వీఎఫ్ఎక్స్ పనులు ఇంకా పూర్తయ్యే సూచనలు కనిపించకపోవడంతో తాజాగా సినిమా విడుదలను 2018 ఏప్రిల్ నెలకు మార్చారు. ఈ మేరకు చిత్ర నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ ఓ ప్రకటన వెలువరించింది. "అత్యాధునిక హంగులతో అదుతేమైన 3డీ చిత్రంగా '2.ఓ' సినిమాను తెరకెక్కిస్తున్నారు దర్శకుడు శంకర్. అందుకు సంబంధించిన పనులన్నీ వేగంగా జరుగుతున్నాయి. 2018 ఏప్రిల్ నెలలో సినిమాను విడుదల చేయాలని నిర?యించాం. అప్పటికి అన్ని పూర్తవుతాయి" అని లైకా ప్రొడక్షన్స్ తెలిపింది. నిర?యించిన షెడ్యూల్ ప్రకారం నవంబర్‌లో టీజర్‌ను విడుదల చేస్తామని సంస్థ గతంలోనే తెలిపింది. ఇక రజనీకాంత్ పుట్టినరోజు సందర్భంగా డిసెంబర్ 12న ట్రైలర్ విడుదల కార్యక్రమం ఉంటుందని చెప్పింది. అయితే ఇప్పుడు వీఎఫ్ఎక్స్ పనులు పూర్తకాకపోవడంతో ఈ ప్రక్రియ మరింత ఆలస్యమయ్యేలా ఉంది. జనవరిలో సినిమా విడుదల ఉంటుందని ఆశించిన అభిమానులకు ఇది ఒకింత నిరాశ కలిగించే అంశమే. అయితే ప్రతీ ఫ్రేమూ అదుతేంగా ఉండాలని తపన పడే దర్శకుల్లో శంకర్ ఒకరు. పైగా ఈ సినిమాను 3డీలో తెరకెక్కిస్తుండటం విడుదల ఆలస్యానికి ప్రధాన కారణం. శరవేగంగా వీఎఫ్ఎక్స్ పనులు పూర్తి చేసి, ఏప్రిల్ 27న సినిమా విడుదల చేస్తారని ప్రముఖ సినీ విశ్లేషకుడు తరుణ్ ఆదర్శ్ ట్విటర్‌లో పేర్కొన్నారు. "2017 ఏప్రిల్ 28 'బాహుబలి2' విడుదలైంది. 2018 ఏప్రిల్ 27న 2.ఓ' విడుదలవుతుంది. చరిత్ర పునరావ ృతం అవుతుందా?" అంటూ ట్వీట్ చేశారు. అన్నట్లు మార్వెల్ స్టూడియోస్ నిర్మించిన 'అవెంజర్స్: ఇన్ఫినిటీ వార్' భారతదేశంలో ఒక వారం ముందుగానే విడుదల కానున్న సంగతి తెలిసిందే. అంటే 2018, ఏప్రిల్ 27నే 'అవెంజర్స్..' చిత్రాన్ని కూడా విడుదల చేయనున్నారు. ఒకటి హాలీవుడ్ చిత్రమైతే మరొకటే దాన్ని తలదన్నే చిత్రం రజనీ సినిమా అని అభిమానులు అంటున్నారు. ఏప్రిల్ నెల సినీ అభిమానులకు పండగే పండగ.

# 25 ఏళ్ల తర్వాత పవన్ చిత్రంతో..!



అలనాటి తార లిజీ దాదాపు 25 ఏళ్ల తర్వాత మళ్లీ కెమెరా ముందుకు రాబోతున్నారు. పవన్‌కల్యాణ్, దర్శకుడు త్రివిక్రమ్ సంయుక్తంగా నిర్మిస్తున్న నితిన్ చిత్రంలో లిజీ కీలక పాత్రలో నటించనున్నారు. ఈ విషయాన్ని లిజీ ఫేస్‌బుక్ ద్వారా వెల్లడించారు.

తెలుగు, తమిళం, మలయాళం చిత్రాల్లో నటించిన మంచి గుర్తింపు తెచ్చుకున్న లిజీ భర్త ప్రియదర్శన్‌తో విడిపోయాక సినిమాలకు దూరమయ్యారు. ఈ విషయం గురించి లిజీ ఫేస్‌బుక్ పోస్ట్‌లో వివరించారు. 'నేను మళ్లీ సినిమాల్లో నటిస్తానా లేదా అని చాలా మంది అడుగుతున్నారు. 25 ఏళ్ల తర్వాత మళ్లీ సినిమాల్లోకి వస్తున్నాను. పవన్‌కల్యాణ్, త్రివిక్రమ్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్న చిత్రంలో ఓ కీలక పాత్రలో నటిస్తున్నాను. ఈ సినిమాకి ఇంకా టైటిల్ ఖరారు కాలేదు. నితిన్, మేఘా ఆకాశ్ జంటగా నటిస్తున్నారు. క ృష? చైతన్య దర్శకత్వం వహిస్తున్నారు.'

'చాలా కాలం తర్వాత న్యూయార్క్‌లో జరుగుతున్న చిత్రీకరణలో కెమెరా ముందుకు వచ్చాను. భయంగా అనిపించింది కానీ థ్రిల్లింగ్‌గా ఉంది. ఈ అనుభవాన్ని మిస్ అయ్యాననే చెప్పాలి. అమెరికాలో సినిమా తొలి షెడ్యూల్‌ను పూర్తిచేశాం. రెండో షెడ్యూల్ కునూర్‌లో చేయనున్నాం. 2018లో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. నటనకు స్వస్తి చెప్పకముందు తెలుగులో ఎనిమిది సినిమాలు చేశాను. అందులో ఆరు సూపర్ హిట్టయ్యాయి. వాటిలో 'మగాడు', '20వ శతాబ్దం' సినిమాలు ఉన్నాయి. ఇవి మలయాళంలో వచ్చిన 'మూన్నమ్ ముర', 'ఇరుపథమ్ నూట్టండు' సినిమాలకు రీమేక్‌గా వచ్చాయి.'

'నిజాయతీగా చెప్పాలంటే తెలుగు చిత్ర పరిశ్రమను వదిలి వెళ్లినందుకు చాలా బాధపడ్డాను. కానీ ఆ సమయంలో నాకు వేరే అవకాశం దొరకలేదు. తెలుగు సినిమాలో నటన అనేది ముగింపు లేని వ్యాపారం లాంటిది.

అందుకే చాలా కాలం తర్వాత తెలుగు సినిమాతోనే ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాను.




# కోహ్లి సేనదే పైచేయి.. శ్రీలంక 131/3

**● ద్విశతకం బాదిన టీమిండియా సారథి ● మ్యాచ్‌లో నాటకీయ పరిణామాలు**

న్యూఢిల్లీ: శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్ట్‌లోనూ టీమిండియా పైచేయి సాధించింది. తొలి రోజే భారీ స్కోరుతో లంకను ఒత్తిడిలోకి నెట్టిన కోహ్లిసేన.. రెండో రోజు మ్యాచ్‌పై పట్టు బిగించింది. తొలి ఇన్నింగ్స్‌లో 7 వికెట్లకు 536 పరుగుల భారీ స్కోరు దగ్గర డిక్లేర్ చేసిన టీమిండియా.. తర్వాత లంకను బౌలింగ్‌తోనూ దెబ్బతీసింది. ఒకదశలో 75 పరుగులకే 3 వికెట్లు కోల్పోయినా.. మాథ్యూస్ (57 నాటౌట్), కెప్టెన్ చండీమాల్ (25 నాటౌట్) ఆదుకున్నారు. దీంతో లంక రెండో రోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 3 వికెట్లకు 131 పరుగులు చేసింది. ఈ ఇద్దరూ ఇప్పటికే నాలుగో వికెట్‌కు 56 పరుగులు జోడించారు. భారత బౌలర్లలో షమి, ఇషాంత్, జడేజా తలా ఒక వికెట్ తీసుకున్నారు. ఇన్నింగ్స్ తొలి బంతికే కరుణరత్నె (0)ను ఔట్ చేశాడు షమి. ఆ వెంటనే కొత్త బ్యాట్స్‌మన్ ధనంజయ సిల్వా (1) కూడా ఔటవడంతో లంక 14 పరుగులకే 2 వికెట్లు కోల్పోయింది. ఈ సమయంలో మాథ్యూస్, పెరీరా (42) మూడో వికెట్‌కు 61 పరుగులు జోడించారు. శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో ఇంకా 405 పరుగులు వెనుకబడే ఉంది.

అంతకుముందు అనూహ్య పరిస్థితుల్లో ఇండియా తమ తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేయాల్సి వచ్చింది. దేశ రాజధానిలో పెరిగిపోయిన కాలుష్యం ఇండియా, శ్రీలంక మూడో టెస్ట్ మ్యాచ్‌కు అడ్డంకిగా మారింది. రెండోరోజు ఈ కాలుష్యం కారణంగా మ్యాచ్‌కు కొన్నిసార్లు అంతరాయం కలిగింది. ఈ వాతావరణంలో ఆడలేమంటూ ఇద్దరు శ్రీలంక ప్లేయర్స్ ఫీల్డ్ నుంచి బయటకు వెళ్లిపోయారు. ఆ ఇద్దరూ లంక స్టార్ బౌలర్లు అయిన గమాగె, లక్మల్. తగినంత మంది రిజర్వ్ ప్లేయర్స్ కూడా లేకపోవడంతో శ్రీలంక.. పది మందితోనే ఆడాల్సి వచ్చింది. దీంతో లంక కెప్టెన్ చండీమాల్ అంపైర్ల దగ్గరికి వెళ్లి తాము ఆడలేమంటూ ఓవైపు చండీమాల్ అంపైర్లతో మాట్లాడుతుండగానే.. మరోవైపు కోహ్లి ఇన్నింగ్స్ డిక్లేర్ చేయడం విశేషం.

టాప్ ఫామ్‌లో ఉన్న కోహ్లి.. కేవలం 287 బంతుల్లో 25 ఫోర్లతో 243 రన్స్ చేశాడు.



2016 వరకు కెరీర్‌లో ఒక్క డబుల్ సెంచరీ లేని విరాట్.. 17 నెలల కాలంలోనే మొత్తం ఆరు డబుల్ సెంచరీలు బాదడం విశేషం. శ్రీలంకతో జరిగిన రెండో టెస్ట్‌లోనూ అతను డబుల్ సెంచరీ చేసిన విషయం తెలిసిందే. కెప్టెన్‌గా ఐదు డబుల్ సెంచరీలు చేసిన బ్రియాన్ లారా వరల్డ్ రికార్డును విరాట్ చెరిపేశాడు.కోహ్లి ఔటైన కాసేపటికే ఇండియా తమ తొలి ఇన్నింగ్స్‌ను 7 వికెట్లకు 536 పరుగుల దగ్గర డిక్లేర్ చేసింది.

### పాన్-ఆధార్ లింక్

# గడువు పెంచేందుకు సిద్ధమే!





దిల్లీ: ఆధార్ తప్పనిసరి చేయడానికి సుప్రీంకోర్టు అంగీకరిస్తే.. పాన్-ఆధాన్ అనుసంధానం చేసుకునేందుకు గడువును పెంచుతామని ప్రభుత్వాధికారులు తెలిపారు. పాన్-ఆధార్ అనుసంధానానికి అవసరమైతే మూడు నుంచి ఆరు నెలల పాటు అదనపు గడువు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. ప్రస్తుతం పాన్ కార్డుకు ఆధార్‌ను అనుసంధానం చేసు కునేందుకు ఆదాయపు పన్ను శాఖ డిసెంబరు 31 వరకు గడువు ఇచ్చింది.

మరికొన్ని రోజుల్లో గడువు ముగియ నుండటంతో మరోసారి గడువును 2018, మార్చి 31 వరకు పొడిగించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రభుత్వం సంకేతాలు ఇచ్చింది. దేశంలో 33కోట్ల మంది పాన్‌కార్డుదారులు ఉండగా.. నవంబర్ వరకు 13.28కోట్ల మంది పాన్ కార్డును ఆధార్‌తో లింక్ చేసుకున్నారు. నకిలీ పాన్ కార్డులను నియంత్రించేందుకు ఈ ఆధార్ అనుసంధానాన్ని తీసుకొచ్చినట్లు అధికారులు తెలిపారు. ఒకవేళ నిర్ణీత తేదీ లోపు ఆధార్‌ను లింక్ చేసుకోకపోతే పాన్‌ను రద్దు చేయనున్నారు.

నకిలీ పాన్ కార్డులు దేశ ఆర్థిక వ్యవస్థకు చాలా ప్రమాదకరం. వాటితో బ్యాంకు ఖాతాలు తెరిచి, లావాదేవీలు జరుపుతున్నారు. దీన్ని నియంత్రిచేందుకు ఈ చర్యలు చేపడుతున్నాం. అని అధికారులు వెల్లడించారు.

### త్వరలో అయోధ్యలో

# రామాలయ నిర్మాణం ప్రారంభం



ముంబై : అయోధ్యలో రామాలయ నిర్మాణం త్వరలో ప్రారంభమవుతుందని బీజేపీ ఎంపీ సుబ్రహ్మణ్య స్వామి తెలిపారు. భక్తులు వచ్చే ఏడాది దీపావళిని అయోధ్యలో నూతన రామాలయంలో జరుపుకోవచ్చునని చెప్పారు. స్వామి మీడియాతో మాట్లాడుతూ రామాలయం నిర్మాణానికి అవసరమైన సామగ్రి సిద్ధంగా ఉందని, అక్టోబరునాటికి నిర్మాణం పూర్తవుతుందని చెప్పారు. రామాలయం నిర్మాణానికి కొత్తగా చట్టం చేయవలసిన అవసరం లేదన్నారు.

వివాద స్థలంలో రామాలయం ఉండేదని నిరూపితమైతే, ఆ స్థలాన్ని హిందువులకు అప్పగిస్తామని పేర్కొందని పీవీ నరసింహా రావు ప్రభుత్వం సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొందని తెలిపారు.

రామాలయం ఉన్నట్లు రుజువైందన్నారు. రామాలయ నిర్మాణం కోసం కొత్తగా చట్టాన్ని తీసుకు రాగలిగినప్పటికీ దాని అవసరం లేదన్నారు. కోర్టు కేసులో విజయం సాధిస్తామన్న నమ్మకం తనకు ఉందని తెలిపారు. అలహాబాద్ హైకోర్టు ఈ కేసులో లోతుగా విచారణ జరిపిందని, సున్నీ వక్ఫ్ బోర్డు ప్రతిఘటించేందుకేమీ లేదని తెలిపారు. ఆ భూమిలో ప్రార్థనలు చేయడం హిందువుల ప్రాథమిక హక్కు అని, ముస్లింలకు ఆ హక్కు లేదని తెలిపారు. ముస్లింలకు కేవలం ఆస్తిపై ఆసక్తి ఉందని, ఇది సాధారణమైనదని తాను వాదనలు వినిపించానని తెలిపారు.

# భారత సైన్యానికి కొత్త బెడద



న్యూఢిల్లీ : మన దేశ సైనికులకు రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యలు శాపంగా మారినట్లు కనిపిస్తోంది. ఏటా దాదాపు 1,600 మంది భారతీయ సైనికులు ఈ రెండు కారణాలకు బలైపోతు న్నారు. జమ్మూ-కశ్మీరులో ఎదురు కాల్పుల్లో అమరులయ్యే సైనికుల కన్నా ఈ సంఖ్య చాలా ఎక్కువగా ఉంది. ఏటా సుమారు 350 మంది నావికులు, సైనికులు, వాయుసేన సిబ్బంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నట్లు అంచనా. సుమారు 120 మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. శిక్షణ సమయంలో జరిగే ప్రమాదాల్లోనూ, అనారోగ్య కారణాలతోనూ అత్యధికంగా మరణాలు సంభవిస్తున్నాయి.

2014 నుంచి సైన్యం, నావికా దళం, వాయుసేన 6,500 మందికి పైగా సిబ్బందిని ఈ విధంగా కోల్పోయాయి. 11.73 లక్షల సిబ్బందిగల సైన్యానికి ఈ బెడద తీవ్రంగా ఉంది. యుద్ధంలో మరణించేవారికన్నా భౌతిక కారణాలతో మరణించేవారు 12 రెట్లు ఎక్కువగా ఉన్నారు. సరిహద్దుల్లో పాకిస్థాన్ నుంచి కాల్పులు, ఉగ్రవాదుల ఏరివేత, నోటిఫైడ్ ఏరియాల్లో ఆపరేషనల్ యాక్సిడెంట్స్ వల్ల 2016లో 112 మంది మరణించగా, భౌతిక కారణాలతో మరణించినవారి సంఖ్య 1,480. ఈ ఏడాది ఇప్పటి వరకు పోరాటంలో 80 మంది మరణించగా, భౌతిక కారణాలతో 1,060 మంది సైనిక సిబ్బంది మరణించారు.

సైన్యం అదిపతి బిపిన్ రావత్ ఈ అంశంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఏటా సుమారు రెండు బెటాలియన్లకు సరిపడినంత మంది భౌతిక కారణాలతో మరణించడం శోచనీయమని పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ సమస్యను అత్యవసరంగా పరిష్కరించవలసి ఉందని ఆయన చెప్పినట్లు సమాచారం. ఇప్పటి వరకు అమలవుతున్న చర్యలను మరింత కచ్చితంగా అమలు చేయడంతోపాటు కొత్తగా మరికొన్ని చర్యలను రూపొందించేందుకు సమాయత్తమైనట్లు తెలుస్తోంది.

### ఇస్లాం పేరుతో ముస్లిం

# మహిళలకు అన్యాయం తగదు



అహ్మదాబాద్: తక్షణ ట్రిపుల్ తలాక్‌ను నిషేధించేందుకు కేంద్రం రూపొందించిన బిల్లుకు యోగా గురువు రాందేవ్ బాబా మద్దతిచ్చారు. ఇస్లాం పేరుతో మహిళలపై జరుగుతున్న ఈ అకృత్యాన్ని తప్పనిసరిగా నిలిపివేయాల్సి ఉంటుందని అన్నారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను ఆదివారంనాడు కలుసుకున్న రాందేవ్ బాబా అనంతరం మీడియాతో మాట్లాడారు. 'మతం పేరుతో మహిళకు అన్యాయం చేయడం సరికాదు' అని ట్రిపుల్ తలాక్ నిషేధం బిల్లుపై ఆయన వ్యాఖ్యానించారు. కేంద్రం ప్రతిపాదించిన బిల్లును ప్రజలంతా స్వాగతించాలని అన్నారు. ముస్లిం మహిళలకు గౌరవం, మేలు చేకూర్చడమే ఈ బిల్లు ఉద్దేశమని అన్నారు. ట్రిపుల్ తలాక్ సరికాదంటూ సుప్రీంకోర్టు ఇటీవల తీర్పునిచ్చింది. ఇందుకు అనుగుణంగా గతవారం కేంద్రం బిల్లు రూపొందించింది. తక్షణ విడాకులు చట్టవిరుద్ధమని, ఇందుకు పాల్పడే భర్తలకు మూడేళ్లు జైలు ఉంటుందని ఈ బిల్లు ప్రతిపాదిస్తోంది. రాష్ట్రాల అభిప్రాయాల కోసం ఈ బిల్లును కేంద్రం పంపించింది. కాగా, ట్రిపుల్ తలాక్‌పై ప్రతిపాదిత బిల్లును ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ సహా పలువురు ముస్లిం మత పెద్దలు, నేతలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

# స్మార్ట్ బస్సులు వచ్చేశాయి!?




న్యూఢిల్లీ : ఇప్పటివరకూ కలలు కంటున్న స్మార్ట్/సెల్ఫ్ డ్రైవింగ్ బస్సులు ప్రజలకు అందుబాటులోకి వచ్చేశాయి. పూర్తి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఈ బస్సులు నుంచి చైనాలోని షెన్‌జెన్ సిటీలో పరుగులు తీస్తున్నాయి.

అత్యంత ఆధునాతన నగరమైన షెన్‌జెన్‌లో దాదాపు 70 శాతం ఐటీ సంస్థలున్నాయి. ఐటీ సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల కొసం ఈ స్మార్ట్ బస్సులును అధికారులు ప్రవేశపెట్టారు. రెండు కిలోమీటర్ల పరిధిలో.. ఈ బస్సులు ప్రయాణిస్తాయి. స్మార్ట్ బస్సులు.. కనిష్టంగా 10 కి.మీ. గరిష్టంగా 30 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి. స్మార్ట్ బస్సులకు జీపీఎస్ ఆంటెన్నా, హై రెజ్యులూషన్‌తో కూడిన హెచ్‌డీ కెమెరాను ఏర్పాటు చేశారు. ఆటో సెన్సార్ టెక్నాలజీ ద్వారా పాదచారులను ఈ బస్సు ఢీ కొట్టే అవకాశం లేదని తెలుస్తోంది. ఎమర్జెన్సీ పరిస్థితులు ఏర్పడితే.. బస్సులో ఉండే డ్రైవర్.. స్మార్ట్ నుంచి మ్యాన్యువల్ డ్రైవింగ్‌కు మార్చి బస్సును నడిపిస్తాడు. ఈ స్మార్ట్ బస్సులను షెంజెన్ ఇంజినీరింగ్ టెక్నాలజీ గ్రూప్ రూపొందించడం విశేషం.

# ఉగ్రవాదంపై పాక్ పోరాడటం లేదు

**ఆ దేశ తీరుపై అమెరికా అసంతృప్తి**



వాషింగ్టన్: ఉగ్రవాదులపై పోరాడటంలో పాకిస్థాన్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అమెరికా అసంతృప్తి వ్యక్తం చేసింది. తాలిబన్లు, హక్కానీ నెట్‌వర్క్‌ను నాశనం చేసేందుకు పాక్ చెప్పుకోదగ్గ చర్యలేమీ తీసుకోలేదని శ్వేతసౌధం సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఉగ్రవాదులపై పోరులో పాక్ వైఖరి పట్ల అమెరికా అసంతృప్తిగా ఉందని ఆయన పేర్కొన్నారు. ముంబయి పేలుళ్ల ప్రధాన సూత్రధారి, జేయూడీ చీఫ్ హాఫీజ్ సయీద్‌ను విడుదల చేయడాన్ని అమెరికా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. సయీద్ విడుదలను ఆపకుండా పాక్ ప్రభుత్వం వెనుకడుగు వేసిందన్నారు.

ఐదేళ్ల పాటు హక్కానీ ఉగ్రవాదుల చెరలో ఉన్న కెనడియన్-అమెరికన్ దంపతులను రక్షించేందుకు పాక్ సహకరించింది. వాళ్ల సురక్షితంగా విడుదల కావడం చాలా ఆనందంగా ఉంది. కానీ ఆ ఘటన ద్వారా ఉగ్రవాదులకు పాక్ వ్యతిరేకమని కచ్చితంగా చెప్పలేను. తాలిబన్, హక్కానీ నెట్‌వర్క్‌పై పాక్ తగిన చర్యలు తీసుకుంటుందని ఇప్పటికీ ఎదురు చూస్తున్నాం. కానీ పాక్ తీరు సంతృప్తికరంగా లేదు. ఆ దేశ వె%ఖరిలో ఎటువంటి మార్పులు రాలేదు. మార్పు రావడానికి కొంత సమయం పడుతుంది. అందుకోసం మేము ఎదురుచూస్తూనే ఉన్నాం. పాక్ చర్యలను చాలా దగ్గరగా పరిశీలిస్తున్నాం.

### ఈవీఎంల ట్యాంపరింగ్...

# దర్యాప్తు జరపాలి

**రాబర్ట్ వాద్రా**



న్యూఢిల్లీ : కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ అల్లుడు రాబర్ట్ వాద్రా ఈవీఎంలపై వివాదంలో భాగస్వామి అయ్యారు. ఉత్తర ప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోరంగా ఓడిపోయిన నేపథ్యంలో ఆయన సామాజిక మాధ్యమాల ద్వారా తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ ఎన్నికల్లో ఈవీఎంల ట్యాంపరింగ్ జరిగిందని ఆరోపించారు. రిగ్గింగ్ జరిగిందన్నారు. దీనిపై దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్న అమేథీలో కూడా ఆ పార్టీ పరాజయం పాలైన సంగతి తెలిసిందే. 652 స్థానిక సంస్థలకు జరిగిన ఎన్నికల్లో 19 మాత్రమే కాంగ్రెస్‌కు దక్కాయి.

## దివ్యాంగులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

*తెతెదేపా అధ్యక్షుడు ఎల్.రమణ*

హైదరాబాద్: దివ్యాంగులను ప్రోత్సహించడంలో తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రమణ విమర్శించారు. దివ్యాంగుల దినోత్సవం రోజున సీఎం ఏ కార్యక్రమంలోనూ పాల్గొనకపోవడం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 200 మంది దివ్యాంగులకు రమణ దుప్పట్లు పంపిణీ చేశారు. కొందరిని ఘనంగా సత్కరించి రూ.5వేల నగదు చొప్పున అందజేశారు.






VIJAYABHANU - Visakhapatnam

Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ★ Phone : 2564353, Fax : 0891-2569004 ★ e-mail: vijayabhanudaily@gmail.com